ప్రజాశక్తి
బుధవారం 15 మార్చి 2023 8 పేజీలు





ప్రకాశం బాపట్ల

నిమిషం ఆలస్యమైనా
నో ఎంట్రీ



- నిఘా నేత్రాల నీడలో ఇంటర్ పరీక్షలు
- పరీక్షా కేంద్రంలో సెల్‌ఫోన్లు నిషిద్ధం
- ఆర్ఐఒ ఏ.సైమన్ విక్టర్ వెల్లడి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో బుధవారం నుంచి ప్రారంభమయ్యే ఇంటర్ పరీక్ష నిర్వ హణకు అన్ని ఏర్పాట్లూ పూర్తిచేసినట్లు ఆర్ఐఒ ఏ.సైమన్ విక్టర్ తెలిపారు. సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలను పటిష్టంగా నిర్వహించేం దుకు అన్ని చర్యలూ తీసుకుంటున్నామన్నారు. పరీక్షలు ప్రారంభమైన తర్వాత నిమిషం ఆలస్యంగా వచ్చిన అనుమతించేది లేదని స్పష్టం చేశారు. బుధవారం మొదటి సంవత్సరం విద్యార్థులతో పరీక్షలు ప్రారంభం కానున్నాయి.

మొత్తం 58,945 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తుండగా, అందులో 27,989 మంది మొదటి సంవత్సరం విద్యార్థులు, 30,956 మంది విద్యార్థులు ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఉన్నారన్నారు. వీరి కోసం 95 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని, కంభం, పెద్దదోర్నాల, అర్ధవీడు, యర్రగొండపాలెంలోని కళాశాలను సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించామన్నారు. ఈ నాలుగు కేంద్రాలపై ప్రత్యేక దష్టి ఉంటుందని, పరీక్షల నిర్వహణకు 95 మంది చీఫ్ సూపరింటెండెంట్, 95 మంది డిపార్ట్మెంట్ అధికారులు 1628 మంది ఇన్విజిలేటర్లను నియమించామన్నారు. పరీక్షల్లో కాపీయింగ్ నిరోధించేందుకు నాలుగు ఫ్లైయింగ్ స్క్వాడ్లు, ఐదు సిట్టింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేశామన్నారు. వీరికి తోడు తాను, డిఇసి సభ్యులు, కలెక్టర్, రెవిన్యూ అధికారులు, రాష్ట్రస్థాయి బోర్డు అధికారులు పరీక్షా కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేస్తారన్నారు. పరీక్ష ఫీజు చెల్లించిన విద్యార్థులందరికీ ప్రవేట్ కార్పొరేట్ కళాశాలలు హాల్ టికెట్లు జారీ చేయాల్సిందేనని ఎవరైనా ట్యూషన్ ఫీజులు చెల్లించలేదని కారణాలతో హాల్ టికెట్లు నిరాకరిస్తే ఆ కళాశాల గుర్తింపు ▶ 2లో

పోలింగ్ సరళిపై ఉత్కంఠ



- గెలుపుపై ఎవరి ధీమా వాళ్లదే..
- ఓట్ల నమోదుపై.. పార్టీల్లో విశ్లేషణలు
- గెలుపు, ఓటములపై అంచనాల్లో నేతలు

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

ఉపాధ్యాయ, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ పోలింగు ప్రక్రియ ముగిసింది. నిన్నటివరకూ ఓటర్లపై ఆశలు పెట్టుకున్న అభ్యర్థులు ఇప్పుడు బ్యాలెట్‌లో తమ భవితవ్యం ఎలా ఉంటుందోనన్న ఉత్కంఠలో ఉన్నారు. పోలింగు సరళిపై విశ్లేషణలు సాగుతున్నాయి. గెలుపు, ఓటములపై అంచనాల్లో ఉన్నారు. ఎవరి ధీమాలో వాళు న్నారు. కేంద్రాల వారీగా పడ్డ ఓట్లపైనా విశ్లేషణలు చేస్తున్నారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ పోలింగ్ 72.77 శాతం జరగ్గా.. ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి పోలింగు 91.93 శాతం జరిగింది.

గ్రాడ్యుయేట్ ఓట్లు అత్యధికంగా ఉన్న ఒంగోలు నియోజకవర్గంలోనే 69.01 శాతం పోలింగ్ జరిగింది. మంత్రి నియోజకవర్గం వైపాలెంలో అత్యధికంగా 77.71 శాతం పోలింగ్ నమోదైంది. ఉపాధ్యాయ పోలింగ్ ఒంగోలులో తప్ప మిగతా నియోజకవర్గాల్లో 90 శాతం దాటింది. పోలింగు సరళిపైనే అంచనాలు వేసుకుంటున్నారు. పోటాపోటీగానే పోలింగు జరిగింది. వైసిపి, తెలుగుదేశం, పిడిఎఫ్ అభ్యర్థుల మధ్యే పోటీ నెలకొంది. అయితే గ్రామాల్లో రెండు రాజకీయ పార్టీలు ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగానే తీసుకున్నాయి. ఎక్కడో ఉన్నవారిని కూడా రప్పించి ఓట్లేయించారు. ప్రభుత్వం పట్ల ఉద్యోగుల్లో వ్యతిరేకత దృష్ట్యా పాలకపక్షం అభ్యర్థి తరపున గ్రాడ్యుయేట్ ఓటర్లకు డబ్బులు పంచారు. ఓటుకు రూ.వెయ్యి లెక్కన ఇచ్చారు. ఒంగోలు మినహా మిగతా చోట్ల పంపిణీలు సాగాయి. ఉపాధ్యాయ ఓటర్లుగా ఉన్న ప్రైవేటు టీచర్లను కొనుగోలు చేశారు. దీంతో వైసిపి అభ్యర్థుల్లో పూర్తి ధీమా ఉంది. డబ్బులు తీసుకున్నందున ఓట్లేస్తారనే ఆశతో ఉన్నారు. తెలుగుదేశం అభ్యర్థులు డబ్బులు పంచలేదు. ఇదే వైసిపిలో ధీమాకు కారణం. కొన్ని చోట్ల వాలంటీర్లు భారీగా చేర్చిన ఓట్లు కూడా తమకు లాభం చేకూర్చుతాయనే అంచనాల్లో ఉన్నారు. వైసిపికి అనుకూలంగా ఉన్నవారిని గుర్తించి ఓట్లు చేర్చారు. ఏదేమైనా పాలకపక్షం నుంచి ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు కూడా మోహరించారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేశారు. ఓటేసే సమయంలోనూ కొన్నిచోట్ల నోట్లు ఇచ్చారు. కొందరు ఉపాధ్యాయులూ అమ్ముడు పోవడంపై సోషల్‌మీడియాలో పోస్టులు పెద్ద ఎత్తున వైరల్ అవుతున్నాయి. తెలుగు దేశం నుంచి ఎన్నికల వ్యూహం కొరవడింది. వైసిపి తమకు ప్రత్యర్థిగా భావించినప్పుడు బలమైన పిడిఎఫ్ అభ్యర్థులకు మద్దతు ఇవ్వలేదు. ఆఖరు నిమిషంలో రెండో ఓటు వేయాలని సూచించారు. రెండో ఓటు పిడిఎఫ్‌కు వేశారు. పార్టీ నుంచి గట్టిగానే ఎన్నికల్లో పనిచేశారు. ప్రభుత్వంపై వ్యతిరేకత తమకు అనుకూలంగా మారుతుందనే అంచ నాల్లో ఉన్నారు. ప్రభుత్వంపై వ్యతిరేక ఓటు ఏ మేరకు చీలిందనే చర్చ కూడా సాగుతోంది. పిడిఎఫ్ కూటమి నుంచి ఉపాధ్యాయ ఎమ్మెల్సీపై ఉపాధ్యాయ వర్గంలో పూర్తి ధీమా కనిపిస్తుండగా గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో గట్టి పోటీ ఉందనే చర్చ సాగుతోంది. పిడిఎఫ్ కూటమిలోనూ గెలుపుపై ధీమాలోనే ఉన్నారు. పార్టీల్లో పలు రకాల విశ్లేషణలు ఉన్నాయి. అభ్యర్థులు కూడా తమకు ఓట్లు ఎలా పడ్డాయనే దానిపై తమ అనుచరుల నుంచీ సమాచారం తెప్పించుకొని విశ్లేషణల్లో తలమునకలయ్యారు. ఘర్షణలు, గొడవల ప్రభావం ఓటింగుపై ఎలాంటి ప్రభావం చూపిందనే చర్చ కూడా సాగుతోంది. ఒంగోలులో రెండు పార్టీల నడుమ జరిగిన ఉద్రిక్తత పరిస్థితులపై పోలీసు వైఫల్యం పూర్తిగా ఉందని మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి చెప్పడం చర్చగా మారింది.

ఒంగోలులో
గొడవలకు కారణం దామచర్ల..

- కార్యకర్తలపై దాడి చేస్తే చూస్తూ ఊరుకోం..
- మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని ధ్వజం



మాట్లాడుతున్న బాలినేని శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

ఎమ్మెల్సీ పోలింగ్ రోజున ఒంగోలులో జరిగిన గొడవలకు కారణం మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనేనని మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి ధ్వజమెత్తారు. మంగళవారంనాడు తన నివాసంలో జరిగిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. పోలింగు రోజున సెయింట్ థెరిస్సా పోలింగు కేంద్రం వద్ద తమ ఓటర్లను ఓటేయకుండా తెలుగుదేశం కార్యకర్తలు అడ్డుకునే యత్నం చేశారన్నారు. దాన్ని ప్రశ్నించినందుకు ఒకరు మీసం మెలేసి.. చొక్కా గుండీలు తీసి.. 'రండి' అంటూ రెచ్చగొట్టేలా చేయడమే గొడవలకు కారణమన్నారు. తాను మౌనంగా ఉన్నా.. కార్యకర్తలపై దాడి చేస్తే చూస్తూ ఎలా ఊరుకుంటారని హెచ్చరించారు. తాను ఉదయాన్నే పోలింగ్ కేంద్రాల వద్దకు వెళ్లడం కూడా తప్పుగా జనార్ధన్ మాట్లాడటం సరికాదన్నారు. ఆయన్ను ఎవరు రావద్దన్నారని ఎద్దేవా చేశారు. ఐదు సార్లు గెలిచావని, ఓర్వలేకనే పోలింగు కేంద్రాల వద్దకు వెళ్లి గొడవలు చేశాననడం.. పోలీసులపై దాడి చేశానని చెప్పడం ఏమి పద్ధతి? అని ప్రశ్నించారు. ఆయనే డిఎస్పీకి, ఎస్పీకి వేలు చూపించి బెదిరించారని ఫొటోలను ప్రదర్శించారు. ఎవరు దౌర్జన్యం చేశారో చెప్పాలన్నారు. రాజకీయాల్లో ఇది మంచిపద్ధతి కాదన్నారు. సంస్కారంగా వ్యవహరించాలన్నారు. పోలీసుస్టేషన్ నుంచి కార్యకర్తను బలవంతంగా బయటకు తీసుకొచ్చాడని.. దీనిపై పోలీసులు ఏ చర్యలు తీసుకుంటారో చూస్తామన్నారు. గుప్తాను మీడియా ముందు కూర్చోబెట్టి రోజూ తనను తిట్టించింది జనార్ధనేనన్నారు. అతనికి డబ్బులు ఇచ్చి మరీ ఏడాదిపాటు ఇలా చేయించాడన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తాము జనం కోసం ధర్నాలు చేస్తే అరెస్టు చేయించి.. పుల్లలచెరువు తీసుకుపోయారని గుర్తు చేశారు. జనం కోసం కూడా చేయడం తప్పా? అని ప్రశ్నించారు. కమ్మపాలెం వెళుతుంటే పోలీసులతో అడ్డుకుంది ఎవరు? అని అడిగారు. తాను కక్ష తీర్చుకోవాలనుకుంటే ఈ నాలుగేళ్లలో ఏమైనా చేయవచ్చని, అయినా కమ్మపాలెం వాసులకు ఏ ఇబ్బందైనా కలిగించానా? చెప్పాలన్నారు. ఇప్పటికైనా ఇలాంటి వ్యవహారాలు మానుకోవాలన్నారు. కారులో మహిళలను ఎక్కించుకుని కారం పొట్లాలు పెట్టుకుని ▶ 2లో

దాడి చేసి..
అక్రమ కేసులు పెడతారా?

- బాలినేనిని ప్రజలు తరిమికొట్టే రోజులు ముందున్నాయి
- నన్ను అరెస్టు చేయాలని పోలీసులపై ఒత్తిడి
- ప్రెస్‌మీట్‌లో దామచర్ల విమర్శలు



మాట్లాడుతున్న దామచర్ల జనార్ధన్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

వైసిపి నేతలే టిడిపి నాయకులు, కార్యకర్తలపై దాడి చేసి అక్రమ కేసులు పెడతారా.? అని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు దామచర్ల జనార్ధనరావు ప్రశ్నించారు. ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి వ్యవహరించిన తీరును ప్రజలు అసహ్యించుకుంటున్నారని, ఆయనను ప్రజలు తరిమికొట్టే రోజులు తొందరలోనే ఉన్నాయన్నారు. స్థానిక టిడిపి కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో బుధవారం జరిగిన పాత్రికేయుల సమావేశంలో దామచర్ల జనార్ధన్‌రావు మాట్లాడారు. అధికారం ఉందని వైసిపి నేతలు టిడిపి నాయకులు, కార్యకర్తలను కొట్టి వారిపైనే అక్రమ కేసులు పెట్టడాన్ని ప్రజలందరూ గమనిస్తున్నారన్నారు. తమ కార్యకర్త ఈశ్వర్‌పై దాడి చేశారని.. రక్షణ కోసం పోలీసు స్టేషన్‌లో ఉంచామని డిఎస్పీ చెప్పారని, అతనిపై కేసు నమోదు గానీ, అరెస్టు గానీ చేయలేదన్నారు. దీంతో తాను పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి సిఐతో మాట్లాడానన్నారు. ఈశ్వర్‌కు భరోసా ఇచ్చి కొత్తపట్నం వెళ్లానన్నారు. తాను వెళ్లిన అర గంటకు ఈశ్వర్‌ని సంతకం పెట్టించుకొని పంపించటం జరిగిందన్నారు. తాను ఈశ్వర్‌ను తీసుకొని వెళ్లి ఉంటే పోలీస్‌స్టేషన్‌లో సిసి కెమెరాలు ఉంటాయి పరిశీలించుకోవచ్చని తెలిపారు. తాను ఈశ్వర్‌ను పోలీస్ స్టేషన్ నుంచి తీసుకెళ్ళ లేదని దామచర్ల స్పష్టం చేశారు. తనపై కార్యకర్తలపై ఎన్ని కేసులు పెడతారో పెట్టుకోవాలని, తాను ప్రజల తరుపున పోరాటం చేస్తున్నానన్నారు. ఎమ్మెల్యే బాలినేని కేసులు పెడితే భయపడేవారు ఎవరూ ఇక్కడ లేరని తెలియజేశారు. తనను అరెస్ట్ చేయాలని ఎమ్మెల్యే బాలినేని పోలీసులపై ఒత్తిడి తీసుకువస్తున్నారని, రానున్న రోజుల్లో కార్యకర్తలను ఇబ్బంది పెట్టిన ఏ ఒక్కరిని వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. బదులుకు బదులు తీర్చుకుంటామని దామచర్ల జనార్ధనరావు స్పష్టం చేశారు. సమావేశంలో టిడిపి నగర అధ్యక్షులు కొఠారి నాగేశ్వరావు, ఎద్దు శశికాంత్ భూషణ్ పాల్గొన్నారు.

నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ

(మొదటిపేజీ తరువాయి)

రద్దు చేస్తామని హెచ్చరించారు. సిసి కెమెరాల పటిష్ట నిఘాలో ఇంటర్ పరీక్షలు జరగనున్నాయని, పరీక్షా కేంద్రాల్లోని అన్ని గదులకు, ప్రధాన ప్రవేశ ద్వారము, ప్రశ్నాపత్రాల బండిల్స్ ఓపెన్ చేసే రూమ్, జవాబు పత్రాలు ప్యాక్ చేసే రూమ్ తో సహా మొత్తం సీసీ కెమెరాలు బిగించామన్నారు. కేంద్రాల్లో ఏం జరుగుతుందనే అది ప్రత్యక్షంగా చూసేందుకు వీలుగా ఒంగోలులోని ఆర్ఐఒ కార్యాల యానికి విజయవాడలోని ఇంటర్ బోర్డు ప్రధాన కార్యాల యానికి సిసి కెమెరాలు అను సంధానించారన్నారు. .

9 గంటల తర్వాత ప్రవేశం లేదు..

పరీక్షల ప్రారంభమైన తర్వాత నిమిషం ఆలస్యంగా వచ్చిన అనుమతించేది లేదని ఆర్ఐఒ తెలిపారు ఉదయం 9 గంటల నుండి 12 గంటల వరకు పరీక్ష జరుగుతుంది. 8.30 గంటలకే విద్యార్థులను పరీక్షా కేంద్రంలోనికి అనుమతిస్తారు. పరీక్ష 9 గంటలకు ప్రారంభం తర్వాత ఎవరు వచ్చినా అనుమతించ బోమని స్పష్టం చేశారు.

పరీక్షా కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు నిషిద్ధం

చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్మెం టల్ అధికార్, ఇన్విజిరేటర్లు, పోలీస్ సిబ్బంది, వైద్య సిబ్బంది, ఇతర స్క్వాడ్ సిబ్బంది ఎవరూ సెల్‌ఫోన్లను పరీక్ష కేంద్రంలోనికి తీసుకురావద్దని కోరారు. పరీక్షలకు సంబంధించిన ఎటువంటి సమస్య ఉన్నా వాటిని జిల్లా కేంద్రంలోని కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్ 08592-281275నం సంప్రదించవల సినదిగా కోరారు. చీఫ్ సూపరింటెండెంట్‌తో పాటు కేంద్రంలో పనిచేసి సిబ్బంది ఎవరూ మొబైల్ ఫోన్ తీసుకు రాకూడ దన్నారు. వేసవిని దష్టిలో పెట్టుకొని విద్యార్థులకు అన్ని ఏర్పాట్లూ చేశామని, ఆర్టీసీ వారి సహకారంతో పరీక్షా కేంద్రాలు దూరంగా ఉన్న చోట్లకు బస్సులను నడుపు తున్నా రన్నారు. అందరి సహకారంతో ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తామని తెలియజేశారు.

గొడవలకు కారణం దామచర్ల..

(మొదటిపేజీ తరువాయి)

తిరుగుతున్నానడం సరికాదన్నారు. నిరూపిస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానన్నారు. ఒంగోలులో జరిగిన గొడవలపై పోలీసుల వైఫల్యం కూడా ఉందన్నారు. అదుపు చేయడంలో పూర్తి వైఫల్యం చెందారన్నారు. జనార్ధన్‌పై చర్యలు తీసుకోవాలని ఎస్పీని కోరతామన్నారు. సమా వేశంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ కుప్పం ప్రసాద్, గొర్రెపాటి శ్రీనివాస రావు, అయినాబత్తిన ఘనశ్యాం, తదితరులు పాల్గొన్నారు.

అనుమానం పిశాచికి..

ఇద్దరు మహిళలు బలి

భర్తల చేతుల్లోనే హత్యకు గురయిన భార్యలు ● మార్కాపురం, పంగులూరు ప్రాంతాల్లో ఘటనలు

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

కడదాకా తోడు ఉంటానని బాస చేసిన భర్త ఆమె పాలిట కాలయముడయ్యాడు. జీవితాంతం రక్షగా ఉండాల్సినవాడే రోకలిబండతో మోది హత్య చేశాడు. మండల పరిధిలోని వేములకోట గ్రామంలో ఈ దారుణం చోటుచేసుకుంది. తాగిన మత్తులో మానవత్వం మరిచి కట్టుకున్న భార్యనే రోకలిబండతో మోది హత్య చేశాడో ప్రబుద్ధుడు. అందిన వివరాల ప్రకారం.. మార్కాపుం మండలం వేములకోట గ్రామానికి చెందిన రేళ్ల సునీత(34)కు వైపాలెం మండలం యల్లారెడ్డిపల్లె గ్రామానికి చెందిన చెందిన శ్రీనుతో 15 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. ఈ దంపతులకు ఇరువురు కుమార్తెలు సంతానం. ఇటీవల కాలంలో మద్యానికి బానిసైన శ్రీను ప్రతిరోజూ పూటుగా మద్యం సేవించి తరచూ భార్య రేళ్ల సునీతతో గొడవ పడుతుండేవాడు. అక్కడితో ఆగకుండా సునీత ఎవరితో అయినా మాట్లాడితే ఒప్పుకునేవాడు కాదు. భార్యపై అనుమానంతో భర్త శ్రీను తరచూ వేధిస్తుండటంతో వేధింపులు తట్టుకోలేక ఎర్రగొండపాలెం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి ఇరువురికి కౌన్సెలింగ్ ఇచ్చారు. కొంతకాలం బాగానే ఉన్నా శ్రీను మరలా భార్య సునీతను ఇబ్బందులకు గురి చేస్తుండటంతో అక్కడి నుంచి వచ్చిన సునీత రెండు వారాల క్రితం మార్కాపురం రూరల్ పోలీస్ స్టేషన్‌లో భర్తపై ఫిర్యాదు చేసింది. పోలీసులు భార్యాభర్తలిద్దరినీ పిలిచి సర్ది చెప్పారు. ఈ క్రమంలో సోమవారం రాత్రి పూటుగా మద్యం సేవించిన శ్రీను మృతురాలి స్వగ్రామం అయిన వేములకోట చేరుకొని తన తల్లి ఇంట్లో నిద్రిస్తున్న సునీత ముఖం మీద దుప్పటికప్పి తలపై రోకలి బండతో కొట్టి హతమార్చాడు. అనంతరం అక్కడి నుంచి పరారయ్యాడు. పెద్దఎత్తున శబ్ధం రావడంతో ఇరుగు పొరుగు వారు ఘటన స్థలానికి చేరుకొని సమాచారాన్ని మార్కాపురం గ్రామీణ పోలీసులకు తెలిపారు. ఎస్ఐ ఆర్ సుమన్ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. సునీత బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్కాపురం ప్రభుత్వ జిల్లా వైద్యశాలకు తరలించారు.



రేళ్ల సునీత (ఫైల్)

ప్రజాశక్తి-పంగులూరు

భర్త అనుమానానికి మహిళ బలైన సంఘటన మంగళ వారం మండలంలోని రామ కూరు గ్రామంలో జరిగింది. భార్యను గొంతు నులిమి చంపి భర్త పరారయినట్లు రేణింగవరం ఎస్ఐ తిరుపతిరావు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. పావులూరి నాగసునీత(32), పావులూరి లక్ష్మీనారాయణలు భార్యాభర్తలు. నాగసునీత మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇంట్లో మంచం మీద చలనం లేకుండా ఉంది. ఇది గమనించిన చుట్టుపక్కల వాళ్లు నాగ సునీతను స్థానికంగా ఉన్న వైద్యుని వద్దకు తీసుకెళ్లగా, అప్పటికే ఆమె మరణించినట్లు వైద్యుడు తెలిపారు. నాగసునీత, నారాయణ తరచూ గొడవలు పడుతూ ఉంటారని, 7 నెలల క్రితం నాగసునీత, భర్త లక్ష్మీనారాయణపై గృహ హింస చట్టం కింద రేణింగవరం పోలీస్ స్టేషన్‌లో కేసు కూడా పెట్టిందని, తరువాత భార్యాభర్తలు ఇద్దరు సఖ్యత పడి, లోకాయుక్త ద్వారా కేసు విరమించుకొన్నారని, భార్యను ఇంటికి తీసుకెళ్లినట్లు ఎస్ఐ తిరుపతిరావు తెలిపారు. లక్ష్మీనారాయణ ఉదయం నుంచి ఇంటిదగ్గర కనిపించలేదు. సాయంత్రం అయినా కూడా ఇంటికి రాలేదు. లక్ష్మీనారాయణే భార్య నాగసునీత గొంతు నులిమి చంపి పరారైనట్లు ఎస్ఐ తిరుపతిరావు తెలిపారు. భార్యను చంపి భర్త పరారైన విషయం గ్రామంలో తెలియగానే గ్రామస్తులంతా నివ్వెరపోయారు. వీరికి తొమ్మిది సంవత్సరాల వయసున్న అభిరాం, ఏడు సంవత్సరాల వయసున్న విజయ్ కుమార్, కుమారులు ఉన్నారు. రేణింగవరం ఎస్ఐ తిరుపతిరావు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



నాగ సునీత మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ తిరుపతిరావు



ఇంకొల్లులో భూదేవమ్మ మృతదేహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

మాదల అంజయ్యకు మాతృవియోగం

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్

ఇంకొల్లుకు చెందిన సిపిఎం సీనియర్ నాయకులు మాదల అంజయ్య తల్లి భూదేవమ్మ(89) మంగళవారం మృతిచెందారు. ఆమె మృతి పట్ల బాపట్ల జిల్లా సిపిఎం కార్యదర్శి సిహెచ్ గంగయ్య సంతాపం వ్యక్తం చేశారు. ఆమె మృతదేహాన్ని సందర్శించి నివాళు లర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో సిపిఎం జిల్లా నాయకులు వై సిద్దయ్య, పెంట్యాల హనుమంతరావు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు, సీనియర్ నాయకులు తలపనేని రామారావు, సిఐటియు నాయకులు ప్రతాప్‌కుమార్, మండల పార్టీ కన్వీనర్ నాగండ్ల వెంకట్రావు, నాయకులు శంకరయ్య, డేవిడ్, హనుమంతరావు తదితరులు ఉన్నారు.



ప్రమాదంలో మృతి చెందిన అనిల్ కుమార్ (ఇన్‌సెట్‌లో) అనిల్ కుమార్ (ఫైల్)

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్: బొలెరో, ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్రమాదంలో యువకుడు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని తిప్పాయ పాలెం గ్రామ సమీపంలోని జాతీయ రహదారి 544-డి పై మంగళవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. అందిన వివరాల ప్రకారం.. అర్థవీడు మండలం నాగులవరం గ్రామానికి చెందిన గుడిపాటి అనిల్ కుమార్(20) తన సొంత పని నిమిత్తం మార్కాపురం పట్టణానికి వచ్చి పని ముగించుకొని తిరిగి స్వగ్రామానికి వెళుతున్న క్రమంలో కంభం నుంచి మిర్చిను తీసుకుని గుంటూరు వెళుతున్న బొలెరో వాహనం వేగంతో వస్తూ ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనం నుజ్జునుజ్జు అయ్యింది. ద్విచక్ర వాహనం నడుపుతున్న గుడిపాటి అనిల్ కుమార్‌కు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదాన్ని గమనించి స్థానికులు హుటాహుటిన ఘటన గురించి మార్కాపురం గ్రామీణ పోలీసులకు తెలుపగా గ్రామీణ ఎస్ఐ ఆర్ సుమన్ సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించి స్థానికుల నుంచి వివరాలను సేకరించారు. మృతుడు అనిల్ కుమార్ ఇంటర్ వరకు చదువు పూర్తి చేసి సైన్యంలో ఉద్యోగ అవకాశం కోసం ప్రయత్నం చేస్తున్నాడు. చేతికి అందివచ్చిన కుమారుడు ఇలా ప్రమాదంలో మృత్యువాత పడడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరవుతున్నారు. మృతుడి తండ్రి మోషయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు మార్కాపురం గ్రామీణ పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్కాపురం ప్రభుత్వ జిల్లా వైద్యశాలకు తరలించారు.

నులిపురుగు నివారణ మాత్రలు పంపిణీ

ప్రజాశక్తి-వేటపాలెం

జాతీయ సేవా విభాగం వారి ఆధ్వర్యంలో నులిపురుగు నివారణ మాత్రలను పంపిణీ చేసినట్లు సెయింట్ ఆన్స్ ఇంజనీరింగ్ కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు సంయుక్తంగా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా కళాశాల లోని జాతీయ సేవా విభాగం వారి ఆధ్వర్యంలో 19 సంవత్సరాలలోపు వయసున్న విద్యార్థులకు నులిపురుగు నివారణ మాత్రలను పంపిణీ చేసినట్లు కళాశాల ప్రధాన అధ్యాపకులు డాక్టర్ మొయిద వేణు గోపాలరావు తెలిపారు. పందిళ్లపల్లి ప్రైమరీ హెల్త్ సెంటర్, జె సుధాకర్ సహకారం తో 800 మంది విద్యార్థులకు నులిపురుగు నివారణ మాత్రలను పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమాన్ని జాతీయ సేవా విభాగం ప్రోగ్రామ్ కన్వీనర్ డి జ్యోతి స్వరూప్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సి తిరుమలరావు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

చీరాల: పిల్లల్లో నులిపురుగులను నివారించి వ్యాధినిరోధక శక్తి పెరుగుదలకు ఆల్బెండజోల్ మాత్రలు దోహదపడతా యని కమిషనర్ ఏసయ్య పేర్కొన్నారు. జాతీయ నులిపురు గుల నివారణ దినోత్సవంలో భాగంగా మంగళవారం పేరాల ఏఆర్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కమిషనర్ ఏసయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా కమిషనర్‌తోపాటు వైద్యులు జాకోబ్ జ్యోతిరావు, శిరీష, రవికుమార్ మాట్లాడారు. ప్రతి పాఠశాలలో విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేస్తామన్నారు. విద్యార్థులు ఆహారం తినే ముందు చేతులు శుభ్రంగా ఉంచుకోవాలని, తద్వారా రోగాల బారిన పడటం తగ్గుతుందని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి సాల్మన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బల్లికురవ రూరల్: జాతీయ నులిపురుగుల దినోత్సవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల పరిధిలోని 10,114 మంది విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేసినట్లు మండల వైద్యాధికారి రమీజు అహ్మద్ తెలిపారు. మండల పరిధిలోని అన్ని గ్రామాలలోని పాఠశాలలో స్కూల్ హెచ్ఎం, అంగన్‌వాడీలు, ఏఎన్ఎంలు మధ్యాహ్నం భోజనం చేశాక విద్యార్థులతో ఈ మాత్రలు మింగించారు. సూపర్వైజర్లు శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, కోటేశ్వరరావు, ప్రేమలీల, కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.



వేటపాలెం సెయింట్ ఆన్స్ ఇంజనీరింగ్ కాలేజీలో నులిపురుగుల నివారణ దినోత్సవం నిర్వహిస్తున్న సిబ్బంది

అద్దంకి: కట్టా రామకోటేశ్వరరావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు మంగళవారం ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ వి మోహన్‌రావు ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ సందర్భంగా 98 మంది విద్యార్థులకు ఈ మాత్రలు పంపిణీ చేశారు. ఏఎన్ఎం ఎస్ నాగేశ్వరమ్మ, ఆశా కార్యకర్త వి రత్నమాల, కళాశాల జాతీయ సేవా పథకం 1, 2 విభాగాల బాధ్యులు డాక్టర్ కె ప్రభుదాసు, డాక్టర్ చిలుకు అనిత ఈ కార్యక్రమాన్ని సమన్వయం చేశారు.

ఇంకొల్లు రూరల్: జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని నులిపురుగుల నివారణ మందులను పంపిణీ చేశారు. ఇంకొల్లు ఎన్ఆర్అండ్‌వీఎస్ఆర్ బాలికోన్నత పాఠశాలలోని విద్యార్థులకు 147 మందికి మాత్రలు పంపిణీ చేశారు. ఇంకొల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 33 పాఠశాలలు, 6 జూనియర్ కళాశాలలు, 45 అంగన్‌వాడీ పాఠశాలల్లోని పిల్లలకు నులిపురుగుల నివారణ మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారిణి ఎం ఎమీమా, మెడికల్ ఆఫీసర్ టి అంజలి, సిహెచ్ఓ కోటేశ్వరరావు, ది ఇంకొల్లు మండల హెల్త్ ఫస్ట్ ఎయిడర్స్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు రావినూతల శ్రీనివాసరావు, సహస్ర, ఉషారాణి, ప్రధానోపాధ్యాయిని వి ఉదయకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

యద్దనపూడి: మండలంలోని యనమదల గ్రామంలోని 3 అంగన్‌వాడీ కేంద్రాలలో జాతీయ నులుపురుగుల నిర్మూలనా దినోత్సవం సందర్భంగా మంగళవారం చిన్న పిల్లలకు డీవార్మింగ్ మాత్రలు వేయించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సుజాత మాట్లాడుతూ 1 నుంచి 5 సంవత్సరాలలోపు పిల్లలకు డీవార్మింగ్ మాత్రలు తప్పనిసరిగా వేయించాలని అన్నారు. ఈ కార్యక్రమం 18వ తేదీ వరకు జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సిహెచ్ సౌభాగ్యం, కె సుబ్బలక్ష్మి, శివలక్ష్మి, ఆశా వర్కరు గాయత్రి పాల్గొన్నారు.

రేపల్లె: మండలంలోని కారుమూరు గ్రామంలో హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్ (విలేజ్ హెల్త్ క్లినిక్) సిబ్బంది ఎంపీపీఎస్ పాఠశాలలో 19 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న పిల్లలందరికీ ఉచితంగా ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సిహెచ్ సుజాత ఆధ్వర్యంలో మంగళవారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం నిర్వహించారు. మూడు సంవత్సరాల చిన్నారుల నుంచి ఇంటర్మీడియట్ విద్యార్థుల వరకు నులిపురుగుల మాత్రలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఏఎన్ఎం లక్ష్మి, బి ప్రసాద్, జి రాఘవదిని, జి వాణిశ్రీ పాల్గొన్నారు.

నిజాంపట్నం: నులిపురుగులతో పలు అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని కూచినపూడి పీహెచ్‌సీ వైద్యశాల సూపర్‌వైజర్ మురళి తెలిపారు. జాతీయ నులి పురుగుల దినోత్సవం సందర్భంగా సోమవారం అడవులదీవి జడ్పీ హైస్కూల్, కొత్తపాలెం బీసీ రెసిడెన్షియల్ పాఠశాలల విద్యార్థులకు ఆల్బెండజోల్ టాబ్లెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశాలు, అంగన్‌వాడీ టీచర్స్ తదితరులు పాల్గొన్నారు.

భట్టిప్రోలు: స్థానిక టిఎం రావు ఉన్నత పాఠశాలలో మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థులకు నులిపురుగుల మందును పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ దారా రవికిరణ్మయి చేతుల మీదుగా ఈ మందును అందజేశారు. వైద్యులు పద్మజ, ఏఎన్ఎంలు రత్నకుమారి, ఆరోగ్య సిబ్బంది, హెచ్ఎం రామకోటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

పర్చూరు: నులిపురుగుల మందులు వేసుకోవటం వల్ల పిల్లల ఆరోగ్యానికి మంచిదని ఎంపిడిఓ లక్ష్మీదేవి అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మండలంలోని వైఆర్ హైస్కూలు, ఎంపియుపి పాఠశాలలో మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి డి నాగేశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు ఇ రాజశేఖర్, బి సురేష్, సిఆర్‌పిలు పాల్గొన్నారు. హాజరు కాని విద్యార్థులకు బుధవారం పంపిణీ చేస్తామని వివరించారు.

మహోన్నత వ్యక్తి మార్క్స్

మానవుడే చరిత్ర నిర్మాత అని పేర్కొన్న..

ప్రజాశక్తి-బాపట్ల

మానవ జాతి చరిత్ర అతీత శక్తులు పుణ్యపురుషుల సృష్టిగా ఘోషిస్తుంటే మానవుడే చరిత్ర నిర్మాత అన్న మహోన్నత వ్యక్తి కారల్ మార్క్స్ అని బాపట్ల జిల్లా సిపిఎం కమిటీ సభ్యులు టి కృష్ణమోహన్ అన్నారు. మంగళవారం కార్ల్ మార్క్స్ వర్ధంతి సందర్భంగా సిపిఎం జిల్లా కార్యాలయంలో ఆయన చిత్రపటానికి సిపిఎం నాయకులు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కృష్ణమోహన్ మాట్లాడుతూ ప్రకృతిని బానిసగా చేసుకొని మానవ చరిత్రను తానే నిర్మించాడని మార్క్స్ ఉద్బోధించాడని అన్నారు. కారల్ మార్క్స్ మరణించి 140 ఏళ్లయినా ఆయన సిద్ధాంతం ప్రపంచాన్ని ప్రభావితం చేస్తూనే ఉందని అన్నారు. ఆయన చూపిన మార్గంలో కోట్లాది మంది పయనిస్తూనే ఉన్నారని పేర్కొన్నారు. సిపిఎం సీనియర్ నాయకులు నూతలపాటి కోటేశ్వరరావు మాట్లాడుతూ శ్రమశక్తి దోపిడీకి వ్యతిరేకంగా కార్మికవర్గం ఉద్యుతమైన పోరాటాలను ప్రారంభించి పనిగంటల తగ్గింపుతోపాటు జీవనానికి సరిపడే వేతనం, మెరుగైన పని పరిస్థితులు, ప్రజాస్వామిక హక్కుల కోసం కార్మిక సంఘాలు పెట్టుబడిదారీ, భూస్వామ్య ప్రభుత్వాలపై తిరుగుబాటుకు కార్ల్ మార్క్స్ ప్రేరణ కలిగించారన్నారు. 17 ఏళ్ల ప్రాయంలోనే పాఠశాల చదువు ముగించిన మార్క్స్ ప్రాచీన సాహిత్యంలోనూ, జర్మన్‌భాషలోనూ, చరిత్ర పాఠాల్లోనూ అత్యంత ప్రతిభ కనబరిచారు. ప్రపంచ కార్మికులారా ఏకంకండి, పోరాడితే పోయేదేమీలేదు బానిస సంకెళ్ళు తప్ప అనే పిలుపుతో కమ్యూనిస్టు ప్రణాళికను ప్రపంచానికి చాటి చెప్పారన్నారు. అదే సూత్రం ప్రపంచ కార్మికవర్గానికి వెలుగుబాట చూపిందన్నారు. జర్మనీలో పుట్టిన ఆయన యూరప్‌లోని అనేక దేశాల నుంచి బహిష్కరణకు గురై 1849 నుంచి లండన్‌లో ప్రవాసిగా జీవితం గడుపుతూ అక్కడే మరణించారన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి మజుందార్, నాయకులు జంగం సామేల్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఏ ఆర్య పాల్గొన్నారు.



మార్క్స్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

కౌన్సిలర్ ఇంటి గోడ అరుగులు కూల్చివేత

ప్రజాశక్తి-అద్దంకి

అద్దంకి పురపాలక సంఘం 12వ వార్డు కౌన్సిలర్ అత్తులూరి రమేష్‌బాబుకు సంబంధించి అత్తులూరి వారి వీధిలోని తన ఇంటి దక్షిణం వైపు ఇంటి గోడకు సేఫ్టీగా ఏర్పాటు చేసుకున్న అరుగులను మంగళవారం తొలగించారు. పురపాలక సంఘం కమిషనర్ ఆదేశాల మేరకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా సిబ్బంది జేసిబి సాయంతో అరుగులను కూల్చి అక్కడ ఉన్న మట్టిని మరో ప్రదేశానికి తరలించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ రమేష్‌బాబు మాట్లాడుతూ ముందస్తుగా మాకెలాంటి సమాచారం లేదని, అరుగులు కూల్చుతున్న సిబ్బందిని ఏమిటని ప్రశ్నిస్తున్న సమయంలో సిబ్బంది కమిషనర్ ఆదేశాల మేరకు అడ్డుగా ఉన్న అరుగుల తొలగిస్తున్నామని తెలిపారన్నారు. స్థానిక నాయకులతో కౌన్సిలర్ రమేష్ కార్యాలయంలోని కమిషనర్ టి రవికుమార్‌కు సమస్యను వివరించి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ చుండూరి మురళీ సుధాకర్, గార్లపాటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందజేత

ప్రజాశక్తి-పర్చూరు

రోటరీక్లబ్ ఆధ్వర్యంలో మండలంలోని నాగుల పాలెం బధిరుల పాఠశాల విద్యార్థులకు పరీక్షల సమయంలో గుడ్లు, పాలు, పౌష్టికాహారం పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. క్లబ్ అధ్యక్షులు నాగభైరు శ్రీనివాసరావు ఆర్థిక సహకారంతో పరీక్షలు రాసే వరకు పౌష్టికాహారం పంపిణీ చేయనున్నామని తెలిపారు. ఈ సందర్భంగా నిర్వాహకులు కోమటి ఆంజనేయులు మాట్లాడుతూ దాతల సహకారం మరువలేనిదని, విద్యార్థులంతా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి పంబి సదానందరెడ్డి, రోటరీ సభ్యులు కొల్లా సుబ్బారావు, పాబోలు వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పి ఉమాదేవి, అనూష, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సిపిఎం సానుభూతిపరుడు అప్పలరాజు భార్య మృతి

ప్రజాశక్తి-పంగులూరు



సరికొండ లక్ష్మి (ఫైల్)

మండలంలోని బయటమంజులూరు గ్రామానికి చెందిన, సిపిఎం సానుభూతి పరుడు, రిటైర్డ్ హెడ్ కానిస్టేబుల్, సరికొండ అప్పలరాజు భార్య, సరికొండ లక్ష్మి(57) మంగళవారం ఉదయం ఐదున్నర గంటల ప్రాంతంలో హైదరాబాదులో మరణించారు. గుండెకు సంబంధించిన సమస్యతో ఆమె కొంతకాలంగా బాధపడుతున్నారు. ఆసుపత్రిలో వైద్యం చేయిస్తూ ఉన్నారు. అయితే మంగళవారం ఉదయం తుది శ్వాస విడిచారు. ఆమె భర్త అప్పలరాజు సిపిఎం సానుభూతిపరుడుగా ఉంటూ, పార్టీకి తన వంతు సహకారం అందిస్తున్నారు. తెలంగాణలో ఉద్యోగం చేస్తూ అక్కడే రిటైర్ అయ్యారు. కుమారుడు సునీల్ హైదరాబాదులో ఉద్యోగం చేస్తుండడంతో కొంతకాలం నుంచి అక్కడ ఉన్నారు. లక్ష్మికి కుమార్తె ఉషారాణి, కుమారుడు సునీల్ ఉన్నారు. ఆమె పార్థివ దేహాన్ని స్వగ్రామమైన బయటమంజులూరుకు తీసుకువస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

పరీక్ష ఏర్పాట్లపై స్పందించని అధికారులు

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్

నేటి నుంచి జరగనున్న ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణపై అధికారులెవ్వరూ స్పందించడంలేదు. పర్చూరు నియోజకవర్గంలోనే విద్యాసంస్థలు అధికంగా ఉన్న ఇంకొల్లులో పరీక్షలు నిర్వహణ, ఏర్పాట్లు, సౌకర్యాలపై ఎవరూ స్పందించలేదు. అసలు పరీక్షలు జరుగుతున్నాయా లేదా, పరీక్షలు రాయకుండానే పాస్ చేయిస్తారా అనే మీమాంస అందరిలో ఉంది. నిర్వహణ బాధ్యత ఎవరిదనేది గోప్యంగా ఉంచటం పలు అనుమానాలకు తావిస్తోంది. ఆర్ఐఒ గాని, స్థానిక అధికారులు గానీ పరీక్షల ఏర్పాట్లపై సమావేశం ఏర్పాటు చేయలేదు. కనీస సమాచారం ఇవ్వకపోవటం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

నేడు వినియోగదారుల హక్కుల దినోత్సవం

ప్రజాశక్తి-చీరాల: ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా బుధవారం అవగాహన సదస్సును ఏర్పాటు చేస్తున్నట్లు కమిషనర్ ఏసయ్య ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు పురపాలక సంఘ కార్యాలయంలో జరిగే సదస్సుకు అందరూ హాజరు కావాలని సూచించారు.

ఎన్‌సీసీ అంటేనే క్రమశిక్షణ

ప్రజాశక్తి-చీరాల

క్రమశిక్షణ, దేశభక్తిని పెంపొందించేందుకు ఎన్సీసీ దోహదపడుతుందని 23వ ఆంధ్రా బెటాలియన్ కమాండింగ్ అధికారి సునీల్ గౌతమ్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు వీఆర్ఎస్, వైఆర్ఎన్ కళాశాలలో జి-20 సమ్మిట్ అవగాహన కోసం ఎన్‌సీసీ విద్యార్థులకు క్విజ్, సెమినార్ పోటీలను మంగళవారం ప్రాముఖ్యత, దీనివల్ల ఉపయోగాలను క్యాడెట్లకు వివరించారు. బెటాలియన్‌లోని అన్ని కళాశాలలు, పాఠశాలల నుంచి సుమారు 100 మంది క్యాడెట్లు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్సీసీ తిరుమలశెట్టి తన్మయి ప్రథమ, మక్కెన సువర్ణకుమారి రెండో స్థానాన్ని కైవసం చేసుకోగా, నరసరావుపేటకు చెందిన ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థి బి. యువరాజు తృతీయ స్థానంలో నిలిచారు. వీరితోపాటు జూనియర్ విభాగంలోని విజేతలకు కమాండింగ్ కల్నల్ సునీల్ గౌతమ్ చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో బెటాలియన్ సుబేదార్ కృష్ణన్ కుమార్, సుబేదార్ లక్ష్మణ, ఎన్సీసీ అధికారి రాజేష్ బాబు, హరీష్, గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చరిత్రను మార్చలేరు: గాదె

ప్రజాశక్తి-బాపట్ల: శిలాఫలకాలు తొలగించగలరేమో గాని, తాను చేసిన అభివృద్ధి చరిత్రను మార్చలేరని మాజీ మంత్రి గాదె వెంకటరెడ్డి అన్నారు. మంగళవారం బాపట్ల పట్టణంలో ఆయన నివాస గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బాపట్ల పట్టణంలో తాను శాసనసభ్యునిగా ఉన్న కాలంలో ఆనాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి సహకారంతో బాపట్లను ఎంతో అభివృద్ధి చేశామన్నారు. అభివృద్ధికి గుర్తుగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, కొణిజేటి రోశయ్య, మాజీ కేంద్ర మంత్రి జైపాల్‌రెడ్డి ద్వారా ప్రారంభించిన శిలాఫలకాలను తొలగించడం దారుణమని అన్నారు. చరిత్రను రూపుమాపే విధంగా చేస్తున్న చౌకబారు నీచ రాజకీయాలు మానుకోవాలని అన్నారు. శిలాఫలకాలు తొలగించడంపై బాపట్ల జిల్లా కలెక్టరు, జిల్లా ఎస్పీ విచారణ చేపట్టాలని కోరారు. సమావేశంలో వైసిపి నియోజకవర్గం నాయకులు అల్లం గోపీకృష్ణ, మాజీ కౌన్సిలర్ చింతా కిషోర్ కుమార్, వైసిపి మహిళా నాయకురాలు జి గిరిజా రాణి, దేగల రవిరెడ్డి, మారుబోయిన శ్రీనివాసరెడ్డి, అల్లూరు టైలర్ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

ప్రజాశక్తి-భట్టిప్రోలు



అధికారులతో సమీక్షిస్తున్న జెడ్పి సీఈఓ జయమోహన్

నియోజకవర్గంలోని జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని ఉమ్మడి గుంటూరు జిల్లా సీఈఓ జయమోహన్ సూచించారు. భట్టిప్రోలు మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఆయన సాధారణ తనిఖీలలో భాగంగా మండల స్థాయి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భట్టిప్రోలు, కొల్లూరు, వేమూరు మండలంలో గృహ నిర్మాణాలు ప్రోగ్రెస్ తక్కువగా ఉన్నాయన్నారు. స్థలాలు మాగాణి భూములు కావటం వలన ఇప్పటి వరకు నిర్మాణ పనులు ప్రారంభించేందుకు అనుకూలించలేదన్నారు. వేసవికాలం రావటంతో లబ్ధిదారులతో మాట్లాడి వారికి అవగాహన కల్పించి నిర్మాణాలు చేపట్టే విధంగా చూడాలన్నారు. అలాగే వేసవి దృష్ట్యా తాగునీటికి సమస్య రాకుండా చూడాలని, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేసి తాగునీటిపై సమీక్షించాలని, ఎంపిడిఒను ఆదేశించారు. అనంతరం సీఈఓను అధికారులు, ప్రజాప్రతినిధులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి టి ఉదయ్ భాస్కర, ఎంపిడిఓ చంద్రశేఖర్, ఈఓపిఆర్‌డి శేఖర్ బాబు, హౌసింగ్ ఏఈ రావూరు సౌమ్య రేవతి, పిఆర్ ఏఈ రామచంద్రరావు, సిబ్బంది పాల్గొన్నారు.

భూముల రీసర్వే ప్రక్రియను పూర్తి చేయాలి: కలెక్టర్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

భూముల రీసర్వే ప్రక్రియ ఆయా గ్రామాల్లో నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కె విజయకృష్ణన్ తెలిపారు. రీసర్వే ప్రక్రియపై మండల సర్వేయర్లతో మంగళవారం స్థానిక స్పందన సమావేశ మందిరంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. బాపట్ల జిల్లాలో సర్వే పూర్తి చేసిన భూములలో ఈ నెల 31వ తేదీలోగా హద్దురాళ్ళు వేయాలని కలెక్టర్ చెప్పారు. హద్దురాళ్ళు వేసే ప్రక్రియపై సర్వే అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. జె పంగులూరు, చందలూరులో ఏడు వేల ఎకరాల భూములు సర్వే మిగిలి పోవడంపై ఆరా తీశారు. జాగర్ల మూడి, యద్దనపూడిలో సర్వే ప్రక్రియ జాప్యంపై ఆరాతీశారు. చినగంజాం మండలం కడవ కుదురు గ్రామంలో సర్వే పనులు ఊపందు కోవాలన్నారు. భూసేకరణ ప్రక్రియలో మండల సర్వేయర్లు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. సచివాలయాలలో భూముల సర్వే కోసం వచ్చే అర్జీలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సర్వే ప్రక్రియలో గ్రామ సర్వేయర్లు చురుకుగా పనిచేసేలా అధికారులు పర్యవేక్షించాలన్నారు. కోలలపూడి గ్రామంలో 890 హద్దురాళ్ళు వేయాల్సి ఉండగా ప్రస్తుతం 520 హద్దురాళ్ళు వేయడంపై ఆమె వివరాలు అడిగి తెలుసుకున్నారు. అడుసుమల్లి గ్రామంలో నాలుగు రోజుల్లో హద్దురాళ్ళు వేయడం పూర్తి చేయాలన్నారు. అధికారులు, సర్వేయర్లు సర్వే ప్రక్రియపై నిర్దిష్టిత వీడలని కలెక్టర్ పలు సూచనలు చేశారు. అనంతరం మండలాలు, గ్రామాల వారీగా సర్వే ప్రక్రియపై జిల్లా సంయుక్త కలెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులు సమీక్షించారు. సమావేశంలో సర్వే ల్యాండ్స్ రికార్డ్స్ ఏ.డి. మురళీకృష్ణ, మండల సర్వేయర్లు పాల్గొన్నారు.

ఎస్‌సి, ఎస్‌టి కేసుల విచారణలో..

సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించాలి: ఎస్పి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

పోలీస్ అధికారులు వత్తి నైపుణ్యత, సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించుకొని ఎస్‌సి, ఎస్‌టి కేసులలో విచారణ జరపాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ పోలీస్ అధికారులకు సూచించారు. మంగళవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయం నుండి జిల్లా ఎస్పీ జిల్లాలో డీఎస్పీలతో వర్చువల్ విధానంలో సమావేశమై ఎస్సీ/ఎస్టీ కేసులపై సమీక్షించారు. జిల్లాలో ఇప్పటివరకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ ప్రకారం నమోదయిన కేసుల వివరాలు, వాటి పురోగతి గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. కేసు ఫైల్స్‌ను స్వయంగా పరిశీలించి సదరు కేసులలో దర్యాప్తు, నిందితుల అరెస్ట్, ఛార్జిషీటు దాఖలు, తదితర విషయాలలో తగిన సలహాలు ఇచ్చారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ ఫిర్యాదులు అందిన వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టాలన్నారు. కేసుల విచారణ సమయంలో బాధితులతో మర్యాదగా నడుచుకోవాలని చెప్పారు. పారదర్శకంగా, నిష్పక్షపాతంగా వ్యవహరిస్తూ వత్తి నైపుణ్యత, సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి త్వరితగతిన విచారణ పూర్తి చేసి, నిర్దేశిత కాల వ్యవధిలో కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేసి, సమర్థవంతమైన ట్రయల్ ద్వారా నిందితులకు కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ కేసుల నమోదు, దర్యాప్తులో అలసత్వం వహించరాదని, అలసత్వం వహించిన పోలీస్ అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. సమావేశంలో రేపల్లె సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ టి. మురళీకృష్ణ, చీరాల సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ పి.శ్రీకాంత్, డి.సి.ఆర్.బి ఇన్స్పెక్టర్ జి.లక్ష్మయ్య, డి.సి.ఆర్.బి ఇన్స్పెక్టర్ బాలమురళీకృష్ణ, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ ఏ.శ్రీనివాస్ పాల్గొన్నారు.

పొగాకు బ్యారన్ దగ్ధం.. రూ.8 లక్షల ఆస్తి నష్టం

ప్రజాశక్తి-హనుమంతునిపాడు

హనుమంతునిపాడు మండలంలోని చిన్నమొప్పలపాడు గ్రామంలో కోటపాటి శేషయ్యకు చెందిన పొగాకు బ్యార్నీ మంగళవారం తెల్లవారుజామున మూడున్నర గంటల సమయంలో ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం జరిగి పూర్తిగా కాలిపోయినట్లు బ్యార్నీ ఓనర్ కోటపాటి శేషయ్య తెలిపారు. తెల్లవారుజామున మూడున్నర గంట సమయంలో పొగాకు కాల్పుల్లో చివరికొట్టు కాలుస్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు తెలిపారు. ఈ ప్రమాదంలో బ్యార్నీలో ఉన్న పొగాకుతో పాటు 1,300 అల్లుడు కర్రలు టైర్లు పైకప్పు సైతం పూర్తిగా ప్రమాదంలో గోడలు కాలిపోయి పడిపోయా యని, తీవ్రనష్టం జరిగిందని తెలిపారు. ప్రభుత్వం స్పందించి కాలిపోయిన పొగాకు బ్యార్నీకి నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరారు.

ఇంటర్ పరీక్షలకు పటిష్ట బందోబస్తు

- పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్
- ఎస్‌పి మల్లికగర్గ్

ప్రజాశక్తి -ఒంగోలు క్రైం

ఇంటర్ మీడియట్ పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్‌పి మల్లికగర్గ్ తెలిపారు. తన కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎస్‌పి మాట్లాడారు. బుధవారం నుంచి ప్రతి రోజు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 72 సెంటర్లలో పరీక్షల నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉన్నందున ఆ ప్రాంతంలో ఎవరూ సంచరించరాదని ఆమె తెలిపారు. పరీక్షా కేంద్రాల్లోకి స్మార్ట్‌వాచ్‌లు, మొబైల్‌ఫోన్స్, ఐపాడ్ ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించబడవని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రంలోకి ఉదయం 9 గంటల లోపు మాత్రమే అనుమతి ఇస్తారని తెలిపారు. ఈ నేపథ్యంలో విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల్ని సకాలంలో పరీక్షా కేంద్రాల వద్దను తీసుకురావాలని ఆమె సూచించారు. పరీక్షా కేంద్రాల్లో ఏమైనా అవాంఛనీయ ఘటనలు చేసుకుంటే డయల్ 100 లేదా పోలీస్ వాట్సప్ 9121102266 నంబర్ కు సమాచారం అందజేయాలన్నారు.



మాట్లాడుతున్న ఎస్‌పి మల్లిక గర్గ్

పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి

శింగరాయకొండ : ఇంటర్ మీడియట్ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. స్థానిక గురుకుల పాఠశాల ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. అధికారులు పరీక్షా కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. గురుకుల పాఠశాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో జూనియర్ ఇంటర్ విద్యార్థులు 201 మంది సీనియర్ ఇంటర్ విద్యార్థులు 198 మంది పరీక్ష రాయనున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో జూనియర్ ఇంటర్ విద్యార్థులు 253, సీనియర్ ఇంటర్ విద్యార్థులు 259 మంది పరీక్షకు హాజరు కానున్నట్లు డిపార్ట్‌మెంట్ అధికారి టి.సునీత, చీఫ్ సూపరింటెండెంట్ జి. రాధరాణి తెలిపారు.

ఇంటర్ పరీక్షలకు 630 మంది విద్యార్థులు

కొండపి : మండలంలో 630 విద్యార్థులు ఇంటర్ పరీక్షలకు హాజరు కానున్నట్లు చీఫ్ సూపరింటెండెంట్ ఎం.వెంకటేశ్వర్లు తెలిపారు. జూనియర్ ఇంటర్ విద్యార్థులు 329, సీనియర్ ఇంటర్ విద్యార్థులు 301 పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. కొండపి జూనియర్ కళాశాలలో జూనియర్ ఇంటర్ విద్యార్థులు 122 మంది, సీనియర్ ఇంటర్ విద్యార్థులు 129 మంది పరీక్ష రాయనున్నట్లు ఆయన తెలిపారు. గురుకుల జూనియర్ కళాశాలలో జూనియర్ ఇంటర్ విద్యార్థులు 76 మంది, సీనియర్ ఇంటర్ విద్యార్థులు 73 మంది, చాణిక్య జూనియర్ కళాశాలలో జూనియర్ ఇంటర్ విద్యార్థులు 116, సీనియర్ ఇంటర్ విద్యార్థులు 99 మంది, కె.ఉప్పలపాడు జూనియర్ కళాశాలలో జూనియర్ ఇంటర్ విద్యార్థులు 15 మంది పరీక్షకు హాజరు కానున్నట్లు ఆయన తెలిపారు.



ఎల్‌ఓసి అందజేస్తున్న మంత్రి సురేష్

రూ. 25 లక్షల ఎల్‌ఓసి అందజేత

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం పంచాయతీ పరిధిలోని వై.కొత్తపల్లి గ్రామానికి చెందిన అంబటి మల్లేశ్వరి కుటుంబ సభ్యులకు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ రూ. 25 లక్షల ఎల్‌ఓసిని విజయవాడలోని తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం అందజేశారు. అంబటి మల్లేశ్వరి కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతుంది. ఆమెకు లివర్ ప్లాంటేషన్ చేయాల్సి ఉంది. వైద్య ఖర్చులకు అధిక మొత్తంలో డబ్బు అవసరం. దీంతో విషయాన్ని మంత్రి సురేష్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మంత్రి సురేష్ రూ. 25 లక్షల మంజూరయ్యేలా కృషి చేశారు. వైద్య చికిత్సల నిమిత్తం ఆర్థిక సహాయం మంజూరు చేసిన ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికి, మంజూరు చేయించిన రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్‌కి మల్లేశ్వరి కుటుంబ సభ్యులు కతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ కొప్పర్తి చిన్న ఓబుల రెడ్డి పాల్గొన్నారు.



అన్నదానాన్ని ప్రారంభిస్తున్న జడ్‌పి చైర్‌పర్సన్ బూచేపల్లి

ప్రసన్నాంజనేయస్వామి తిరునాళ్ల

ప్రజాశక్తి-దర్శి

దర్శి పట్టణంలో వేంచేసియున్న శ్రీ సువర్చల సమేత ప్రసన్నాంజనేయస్వామి 53వ వార్షికోత్సవ తిరునాళ్ల వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు కలవకొలను చంద్రశేఖర్‌బాబు, రమణయ్య స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అభిషేకాలు, కుంకుమార్చనలు చేశారు. జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్ వేర్వేరుగా స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శి మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, నగరపంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య తమ కుటుంబ సభ్యులతో కలిసి స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శి గడియారస్తంభం సెంటర్‌లో కొత్తపాలెం బూచేపల్లి యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదానాన్ని బూచేపల్లి వెంకాయమ్మ, బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ప్రారంభించారు. డాక్టర్ మునగా నరసింహారావు ఆధ్వర్యంలో మునగా నాగసుబ్బయ్య మెడికల్ షాపు వద్ద తీర్థప్రసాదాలు, మంచినీళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైసిపి, జనసేన ఆధ్వర్యంలో విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేశారు. తిరుమల వెంకీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్ సౌజన్యంతో పాటకచ్చేరి నిర్వహించారు. డిఎస్‌పి నారాయణస్వామిరెడ్డి ఆధ్వర్యంలో సిఐ జె రామకోటయ్య పర్యవేక్షణలో ఎస్ఐ రామకృష్ణ, పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.



పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్

నోబిడ్లు లేకుండా చూడాలి

177 బేళ్ల తిరస్కరణ పట్ల పొగాకు రైతుల అసంతృప్తి

ప్రజాశక్తి-టంగుటూరు

పొగాకుకు ఇతర దేశాలలో మంచి డిమాండ్ ఉన్నప్పటికీ కొనుగోళ్లలో నో బిడ్లు అధికంగా వస్తున్నాయని రైతులు అసంతృప్తి వ్యక్తం చేశారు. స్థానిక కొండపి రోడ్డులోని పొగాకు వేలం కేంద్రానికి కె.ఉప్పలపాడు గ్రామానికి రైతులు 810 పొగాకు బేళ్లను అమ్మకానికి తెచ్చారు. అందులో 633 పొగాకు బేళ్ళు అమ్ముడు పోయాయి. వివిధ కారణాల చేత 177 బేళ్లను తిరస్కరించడం పట్ల బోర్డు అధికారులు, వ్యాపారుల తీరుపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరస్కరణకు గురైన 177 పొగాకు బేళ్లలో 142బేళ్లు నో బిడ్డు గాను, 12 సిఆర్ గాను ఇతర కారణాలతో మరో 23 బేళ్లను వ్యాపారాలు తిరస్కరించారు. మాండూస్ తుఫాను కారణంగా ఎప్పుడూ పడని కష్టాలు పడ్డామని, రైతుల శ్రమను దృష్టిలో ఉంచుకుని అధికారులు, వ్యాపారులు కొంత మానవతా దక్పథంతో వ్యవహరించాలని మొర పెట్టుకుంటున్నప్పటికీ ఫలితం లేదని రైతులు వాపోయారు. ఈ కార్యక్రమంలో వేలం నిర్వహణాధికారి అట్లూరి శ్రీనివాసరావు, బోర్డు సిబ్బంది, వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.



టంగుటూరులో వేలం నిర్వహిస్తున్న బోర్డు అధికారులు

87 పొగాకు బేళ్లు తిరస్కరణ

కొండపి : కొండపి పొగాకు వేలం కేంద్రానికి మండల పరిధిలోని చోడవరం, ముప్పవరం గ్రామాలకు చెందిన చెందిన రైతులు 902 పొగాకు బేళ్లు అమ్మకానికి తెచ్చారు. అందులో 815 బేళ్లు అమ్ముడుపోయాయి. వివిధ కారణాల చేత 87 బేళ్లను తిరస్కరించారు. కిలో పొగాకు అత్యధిక ధర రూ.200, అత్యల్ప ధర రూ.190, సరాసరి ధర రూ.197.79 పైసలు పలికినట్లు వేలం కేంద్ర నిర్వహణాధికారి ఎస్.రామారావు తెలిపారు.

మద్దిపాడు : మండల పరిధిలోని వెల్లంపల్లి పొగాకు వేలం కేంద్రానికి 949 పొగాకు బేళ్లు అమ్మకానికి రాగా 827 బేళ్లు అమ్ముడు పోయాయి. వివిధ కారణాల చేత 43 బేళ్లను తిరస్కరించారు. కిలో పొగాకు అత్యధిక ధర రూ.200, అత్యల్పధర రూ.190, సరాసరి ధర రూ.195.95 పలికినట్లు వేలం కేంద్ర నిర్వాహణాధికారి శ్రీనివాస్ తెలిపారు. వేలంలో 8 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నట్లు ఆయన తెలిపారు.



నివాళులర్పిస్తున్న సిఐటియు నాయకులు

గుండెపోటుతో కార్మికుడు మృతి

ప్రజాశక్తి-చీమకుర్తి

సివిల్ సప్లయి కార్మికుడు బిందె వెంకటేశ్వర్లు(37) గుండెపోటుతో మంగళవారం మృతి చెందాడు. సివిల్ సప్లయి గోడౌన్ వద్ద పనులు నిర్వహిస్తుండగా గుండెపోటు రావడంతో ఆయన అక్కడిక్కడే కుప్పకూలిపోయాడు. తోటి కార్మికులు ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే వెంకటేశ్వర్లు మృతిచెందినట్లు నిర్ధారించారు. వెంకటేశ్వర్లు 2016 నుంచి సివిల్ సప్లయి ముఠా కార్మికునిగా పనిచేస్తున్నాడు. సివిల్ సప్లయి ముఠా వర్కర్స్ యూనియన్(సిఐటియు)లో సభ్యునిగా కొనసాగుతున్నారు. సిఐటియు జిల్లా కార్యదర్శి కాలం సుబ్బారావు, సిఐటియు మండల కార్యదర్శి పల్లాపల్లి ఆంజనేయులు, నాయకులు పూసపాటి వెంకటరావు, సివిల్ ముఠా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బిందె ఆంజనేయులు తదితరులు వెంకటేశ్వర్లు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ప్రభుత్వం మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.

గురుస్వామి శరభయ్యకు నివాళి

ప్రజాశక్తి- నాగులుప్పలపాడు

నాగులుప్పలపాడులోని శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థాన వ్యవస్థాపకులు గురుస్వామి బిడిపోతు శరభయ్య (84) మంగళవారం తెల్లవారు జామున గుండెపోటుతో మతి చెందారు. శరభయ్య మున్సిపల్ కమిషనర్, పంచాయతీ రాజ్, పంచాయతీ కార్యదర్శిగా ప్రజలకు సేవలు అందించారు. ఇంకొల్లు రోడ్‌లో ఇటీవల ఆశ్రమాన్ని నిర్మించారు. శరభయ్య మృతదేహాన్ని చీరాల ఎమ్మెల్యే కరణం బలరాం కష్ణమూర్తి, ఎత్తిపోతల పథకం మాజీ అధ్యక్షుడు ఉప్పుటూరి శింగయ్య, గ్రామ పెద్దలు, సహచర ఉద్యోగులు తదితరులు సందర్శించి పూల మాలలు వేసి నివాళులర్పించారు.



మృతిచెందిన శరభయ్య

రత్తమ్మకు డాక్టర్ వెంకయ్య నివాళి

ప్రజాశక్తి-కొండపి

మండల పరిధిలోని ముప్పరాజుపాలెం గ్రామ వైసిపి నాయకుడు పర్చూరి సుబ్బయ్య తల్లి రత్తమ్మ అనారోగ్యంతో మంగళవారం చెందింది. రత్తమ్మ మృతదేహాన్ని పిడిసిసి బ్యాంకు చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రత్తమ్మకు నివాళ లర్పించిన వారిలో నాయకులు బొక్కిసం సుబ్బారావు, కొండపి సొసైటీ చైర్మన్, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి బొక్కిసం ఉపేంద్రచౌదరి, ఇవవర గ్రామ నాయకులు దివి శ్రీనివాసరావు, వసంతరావు , నాజర్ ఉన్నారు.



నివాళులర్పిస్తున్న డాక్టర్ వెంకయ్య

జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం

ప్రజాశక్తి - యర్రగొండపాలెం

జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా స్థానిక రెయిన్‌బో ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు మంగళవారం నులిపురుగుల మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఐటిడిఎ డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్‌ఒ డాక్టర్ ఎం. శ్రీనివాసరావు మాట్లాడుతూ కడుపులో నులి పురుగులు ఉన్న వారికి రక్తహీనత, ఆకలి మందగించడం, తరచూ కడుపులో నొప్పి, వాంతులు, విరేచనాలు, రక్తంలో మలం పడడం, నీరసంగా ఉండడం వంటి లక్షణాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి దొంతా కిరణ్ గౌడ్, వెంకటాద్రిపాలెం ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ కోటా నాయక్, ఎంపిడిఒ రంగసుబ్బ రాయుడు, ఎంఇఒ ఆంజనేయులు, రెయిన్ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ దొంతా కిశోర్ గౌడ్, ప్రిన్సిపల్ దొంతా నిఖిల కిరణ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. **శింగరాయకొండ :** జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా శింగరాయకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ చైతన్య కష్ణ ఆధ్వర్యంలో నులిపురుగుల నివారణ మాత్రలు మిగించారు. మండల పరిధిలోని ప్రాథమిక పాఠశాలలు, ఉన్నత పాఠశాల, మలినేని సుశీలమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాల, అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల చేత అల్బెండజోల్ మాత్రలు మిగించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్యపరీక్షకుడు సయ్యద్ మసూద్ అలీ, ఎంఇఒ శివన్నారాయణ, ప్రధానోపాధ్యాయురాలు దుంప భారతి, హరే రామ్, ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, రాఘవేంద్రరావు, డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ శ్రీనివాసులు రెడ్డి , శ్రీనివాసులు, అర్రెబోయిన రాంబాబు ,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. **జరుగుమల్లి :** జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా విద్యార్థుల చేత నులిపురుగుల నివారణ మాత్రలు మిగించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ పి.రామకృష్ణ మాట్లాడుతూ మండల పరిధిలోని అన్ని పాఠశాలల విద్యార్థుల చేత నులిపురుగుల నివారణ మాత్రలు మింగించేలా చర్యలు తీసుకోవాలని ఎంఇఒ బత్తల నాగేంద్ర వదన్‌కు సూచించారు. జరుగుమల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సిహెచ్. సరస్వతి మాట్లాడుతూ అనారోగ్యం, ఇతర మందులు వాడుతున్న పిల్లలకు ఆల్‌బెండ్‌జోల్ మాత్రలు ఇవ్వరాదని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రదానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, ఉపాధ్యాయుడు ఎల్.శ్రీనివాసరావు, సిహెచ్‌ఒ వెంకటేశ్వరరావు, వైద్య సిబ్బంది, రజియాబి, ఎన్‌ఎంలు , అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు. **పిసిపల్లి :** జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కాట్రగడ్డ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విద్యార్థుల చేత ఆల్బెండజోల్ మాత్రలను మిగించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని 2 సంవత్సరాల నుంచి 19 సంత్సరాలలోపు విద్యార్థుల చేత ఆల్బెండజోల్ మాత్రలను మగించినట్లు డాక్టర్ ఎ.నాగరాజ్యలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **టంగుటూరు :** విద్యార్థుల ఆరోగ్య సంరక్షణకు కృషి చేస్తున్నట్లు పేస్ ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్ తెలిపారు. నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారుల సూచనల మేరకు విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. అనంతరం వెంకటాయపాలెం రోడ్డులోని మహాత్మ జ్యోతిబా పూలే బాలుర రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థులకు మాత్రలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ ఎస్ ప్రసాద్ బాబు, సిహెచ్‌ఒ డిఎన్ వెంకటేశులు, పేస్ కళాశాల ప్రిన్సిపల్ జివికె. మూర్తి, పాలిటెక్నిక్ ప్రిన్సిపల్ కోటిరెడ్డి, స్టూడెంట్స్ డీన్ వీరాంజనేయులు, హెల్త్ వాచ్ కమిటీ కన్వీనర్ బ్రహ్మం, పిహెచ్‌సి సిబ్బంది శ్రీనివాసులు, పెంచలమ్మ, మమత తదితరులు పాల్గొన్నారు. **వెలిగండ్ల :** జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమములో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు నులిపురుగుల నివారణ మంత్రులు మంగళవారం మింగించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ టి.సుకుమార్, ఎంఇఒ డి.దాసుప్రసాద్, ప్రధానోపాధ్యాయుడు విజయభాస్కర్, ఉపాధ్యాయులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. **పెద్దదోర్నాల :** జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా స్థానిక బీసీ కాలనీలోని అంగనవాడీ సెంటర్‌లో చింతల పిహెచ్‌సి వైద్యురాలు డాక్టర్ సాయి ప్రశాంతి ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రం, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లోని విద్యార్థుల చేత ఆల్‌బెండజోల్ మాత్రలు మింగించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఒ మంత్రుల నాయక్, సూపర్‌వైజర్ పద్మావతి, అంగన్‌వాడీ కార్యకర్త మల్లేశ్వరి, దేవి, పద్మావతి, నిర్మల,హెల్త్ అసిస్టెంట్, భరత్ భూషణ్, ఆశా వర్కర్ సుకన్య పాల్గొన్నారు. **హనుమంతునిపాడు :** జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలను ఎంపిడిఒ జివి. కృష్ణారావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ విద్యార్థులకు పరిశుభ్రత గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రతాప్ రెడ్డి, ఎంఇఒ పెద్దిరాజు పాల్గొన్నారు. **నాగులుప్పలపాడు :** జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా నాగులుప్పలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు అనంతరం విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి నలమలపు అంజమ్మ, కష్ణారెడ్డి, ఎంపిడిఒ బివివి. కుమారి, డాక్టరు ఓనారియల్, ఎపిఎం రవికుమార్, ఎపిఒ ధనుంజయ్ వర్మ, పంచాయతీ కార్యదర్శి బుచ్చిబాబు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. **సంతనూతలపాడు రూరల్ :** జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మండల పరిధిలోని పేర్నమిట్టలోని సుందరయ్య కాలనీ అంగనవాడీ కేంద్రం వద్ద విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు మిగించారు. ఈ కార్యక్రమంలో 42వ డివిజన్ కార్పొరేటర్ నూకతోటి మస్తానమ్మ, ఎఎన్ఎం సరస్వతీ, అంగన్‌వాడీలు డి.కామేశ్వరి, బి. రమాదేవి తదితరులు పాల్గొన్నారు. **మద్దిపాడు :** నులిపురుగులు వల్ల మనిషి ఆరోగ్యంగా జీవించలేరని స్థానిక పిహెచ్‌సి వైద్యురాలు డాక్టర్, డి.మానస తెలిపారు. జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల చేత నులిపురుగుల నివారణ మాత్రలు మిగించారు. ఈ సందర్భంగా డాక్టర్ మానస మాట్లాడుతూ మండల పరిధిలోని మొత్తం 9,036 మంది విద్యార్థులకు గానూ 8.133 మందికి మాత్రలు మింగించినట్లు తెలిపారు. మిలిగిన విద్యార్థుల చేత ఈనెల 18న మిగించనున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు జె. లక్ష్మి నారాయణ, ప్రధానోపా ధ్యాయుడు డి. గంగాధర్, సిహెచ్‌ఒ లలితకుమారి, హెల్త్ సూపర్ వైజర్లు బాలకోటయ్య. నాగేశ్వరరావు,ఎఎన్ఎం సుభాషిణి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



మద్దిపాడులో మాత్రలు మిగింస్తున్న డాక్టర్ మానస



జరుగుమల్లిలో మాత్రలు మిగిస్తున్న ఎంపిడిఒ రామకృష్ణ

మేలుజాతి దూడలను కాపాడాలి

ప్రజాశక్తి-దర్శి

పశుపోషకులు మేలుజాతి దూడలను కాపాడాలని పశు వైద్యశాఖ జిల్లా అధికారులు డాక్టర్ కాలేషా, డాక్టర్ రమేష్ అన్నారు. మండల పరిధిలోని పాపిరెడ్డిపాలెం గ్రామంలో మేలుజాతి దూడల పెంపకంపై రైతులకు సలహాలు, సూచనలు చేశారు. పశువులకు వ్యాధులు రాకుండా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పశుపోషకులు నత్తలనివారణ గురించి తెలుసుకోవాలన్నారు. అనంతరం వైస్ఎంపిపి సోము దుర్గారెడ్డి, గ్రామ సర్పంచి ముచ్చుమారి వెంకటరెడ్డి చేతుల మీదుగా పశుపోషకులకు మందులు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో బొట్లపాలెం పశువైద్యాధికారి డాక్టర్ బసవయ్య, పశుపోషకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

మండల పరిధిలోని వేగినాటి కోటయ్య నగర్‌కు చెందిన అనాథలు, చెంచులు, పేద పిల్లలకు విజయ్ సోషల్ సర్వీస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం రెడీమేడ్ దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విజయ్ సోషల్ సర్వీస్ ట్రస్ట్ చైర్మన్ విజయ్ కుమార్ మాట్లాడుతూ పశ్చిమ ప్రాంతంలో పేదలు, అనాథలు, నిర్భాగ్యులకు ఆదుకునేందుకు తమ ట్రస్టు ముందుంటుందని తెలిపారు. ఈ పాటికే పశ్చిమ ప్రాంతంలో సేవా కార్యక్రమాలను ముమ్మరం చేసినట్లు చెప్పారు. భవిష్యత్తులో పేదలకు ఉచిత విద్య, ఉచిత వైద్యం తదితర సేవలను సైతం అందుబాటులోకి తేనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు కోశాధికారి నిరీక్షణమ్మ, మిల్లంపల్లి వైస్ సర్పంచి దాసరి సుబ్బయ్య, వాలంటరు రవి కుమారి తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహార కిట్లు అందజేత

ప్రజాశక్తి-మార్కాపురం

ప్రధానమంత్రి టిబి ముక్త భారత అభియాన్ కార్యక్రమంలో స్థానిక ప్రభుత్వ జిల్లా వైద్యశాలలో టిబి రోగులకు పౌష్టికాహార కిట్లను వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.సుబ్బారెడ్డి మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయ వ్యాధిగ్రస్తులు తప్పని సరిగా పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా 30 మంది టిబి రోగులకు పౌష్టికాహార కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం టిబి యూనిట్ పర్యవేక్షకుడు డాక్టర్ రాంబబాబు, టిబి యూనిట్ సిబ్బంది పాల్గొన్నారు. **పెద్దదోర్నాల :** దోర్నాల ప్రభుత్వ వైద్యశాలలో ప్రధానమంత్రి టిబి ముక్త భారత అభియాన్ కార్యక్రమంలో భాగంగా 50 మంది టిబి రోగులకి పౌష్టికాహార కిట్లను హాస్పిటల్ సూపరింటిండెంట్ డాక్టర్ భాస్కర్ కుమార్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీబి యూనిట్ సిబ్బంది వెంకట్రావు, ఎల్‌టి. చిరంజీవి తదితరులు పాల్గొన్నారు

సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి-దర్శి

మండల పరిధిలోని శామంతపూడి అంబేద్కర్ ఎస్‌సి కాలనీలో విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ప్రతినిధి నాగమణి కోరారు. ఎస్‌సి కాలనీ మహిళలతోకలిసి విద్యుత్ కార్యాలయ అధికారులకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగమణి మాట్లాడుతూ చాలా రోజులుగా విద్యుత్ సమస్యలు పరిష్కారించాలని కాలనీ వాసులు కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని ఎస్‌సి కాలనీ మహిళలు కోటేశ్వరమ్మ, కొండమ్మ కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర దళితసేన నాయకులు ప్రేమ్‌కుమార్, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి-సంతనూతలపాడు రూరల్

మండల పరిధిలోని మంగమూరు గ్రామంలో తానిపర్తి పిచ్చిరెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు తానిపర్తి శేషిరెడ్డి ఆధ్వర్యంలో హెచ్‌డబ్ల్యు పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు పెన్నులు, నోటు పుస్తకాలు,పెన్సిళ్లు, బిస్కెట్ ప్యాకెట్లు , వాటర్ బాటిళ్ల ను మంగళవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తానిపర్తి శేషిరెడ్డి , తాటిపర్తి రాజశేఖరరెడ్డి, నిరంజన్ రెడ్డి,పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.వెంకటేశ్వరరెడ్డి, ఉపాధ్యాయురాలు శ్రీదేవి పాల్గొన్నారు.

ఒంగోలు ఘటన ..

అధికార దుర్వినియోగానికి పరాకాష్ట

- దౌర్జన్యం చేసిన వారిని వదిలి పెట్టి దామచర్లపై కేసు నమోదా.?
- పోలీసులు వివక్షపూరితంగా వ్యవహరించడం దారుణం
- టిడిపి ఎమ్మెల్యేలు డోలా,గొట్టిపాటి,ఏలూరి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

శాసనమండలి ఎన్నికల్లో ఒంగోలులో దౌర్జన్యం చేసిన వైసిపి నాయకులను వదిలి ప్రతిపక్ష టిడిపి నాయకులపై కేసులను నమోదు చేయడం ఏమిటని ఆపార్టీ ఎమ్మెల్యేలు డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, గొట్టిపాటి రవికుమార్, ఏలూరి సాంబశివరావు ప్రశ్నించారు. ఎమ్మెల్సీ ఎన్నిక సందర్భంగా టిడిపి కార్యకర్తలపై దాడిని, మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌పై అక్రమ కేసును ఖండిస్తూ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా అధికార పార్టీ నేతలు అరాచకాలకు పాల్పడటం సిగ్గుచేటన్నారు. పోలింగ్ బూత్‌లో జరిగిన ఘటనను తెలుసుకునేందుకు వెళ్లిన మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్, టిడిపి కార్యకర్తలపై వైసిపి నేతలు దౌర్జన్యానికి పాల్పడం వైసిపి అరాచక పాలనకు నిదర్శనమన్నారు. టిడిపి కార్యకర్తలపై వైసిపి నాయకులతో కలిసి పోలీసులు లాఠీఛార్జి చేయడం దారుణమన్నారు. దౌర్జన్యానికి పాల్పడిన వైసిపి నాయకులను వదిలి దెబ్బలు తిన్న టిడిపి కార్యకర్తలపై కేసులు నమోదు చేయడం ఏమిటని వారు ప్రశ్నించారు. పోలీసులు అధికార పక్షానికి వత్తాసు పలకడం సరికాదన్నారు. వైసిపి నాయకులు అధికార దుర్వినియోగానికి పాల్పడినా పోలీసులు, అధికార యంత్రాంగం ప్రేక్షక పాత్ర వహించారని మండిపడ్డారు. మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌పై పెట్టిన కేసును తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. టిడిపి కార్యకర్తలపై దాడికి పాల్పడిన వారిపై కేసులు నమోదు చేయాలన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

హనుమంతునిపాడు : మండల పరిధిలోని వేములపాడు గ్రామానికి చెందిన బాలచెన్నయ్య అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. మృతుడి కుటుంబం సభ్యులను మాజీ ఎమ్మెల్యే, టిడిపి కనిగిరి ఇన్‌ఛార్జి డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి మంగళవారం పరామర్శించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి, గాయం రామిరెడ్డి, బ్రహ్మంగౌడ్, మురహరి నరసయ్య, చీకటి వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

టిడిపి మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా షరీఫ్

వెలిగండ్ల : టిడిపి కనిగిరి నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా జిల్లా పరిషత్ మాజీ కోఆప్షన్ సభ్యులు షేక్ షరీఫ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా షరీఫ్ మాట్లాడుతూ టిడిపి అధిష్టానం, డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండ పార్టీ బలోపేతానికి తన వంతు కషి చేస్తానని తెలిపారు. తన నియామకానికి కృషి చేసిన మాజీ ఎమ్మెల్యే, టిడిపి కనిగిరి ఇన్‌ఛార్జి డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డికి ఈ సందర్భంగా షరీఫ్ కతజ్ఞతలు తెలిపారు.

భూసర్వే పరిశీలన

మద్దిపాడు : ప్రతి ఒక్కరకూ భూహక్కు , భూరక్ష ఉపయోగించుకోవాలని డిపిఒ జివి. నారాయణరెడ్డి తెలిపారు. మండల పరిధిలోని నందిపాడు గ్రామంలో నిర్వహిస్తున్న భూహక్కు, భూరక్ష సర్వేను డిపిఒ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూసర్వే పూర్తయితే హక్కుదారులకు ధ్రువపత్రాలు అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఇఒపిఆర్‌డి సుబ్బారావు, సర్వేయర్లు పాల్గొన్నారు.

మోసపోకండి.. నష్టపరిహారం పొందండి

- వినియోగదారుల రక్షణ చట్టం 2019 గురించి తెలుసుకోండి
- కొనుగోలు చేసే వస్తు, సేవల్లో నష్టాలపై పరిహారం పొందండి
- నేడు అంతర్జాతీయ వినియోగదారుల దినోత్సవం


దాసరి ఇమ్మానుయేలు
మేలుకొలుపు వినియోగదారుల సంరక్షణ సంఘం కార్యదర్శి

ప్రజాశక్తి-వేటపాలెం

మార్చి 15న అంతర్జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవం ప్రతి సంవత్సరం జరుపుకుంటున్నాం. వినియోగదారుల ఉద్యమ పితామహుడిగా పేరుగాంచిన 'రాల్ఫ్‌నాడార్' కృషి వల్లే... ప్రపంచమంతటా వినియోగదారుల ఉద్యమ సంఘాలు ఏర్పడ్డాయి. ఇవి వినియోగదారుల సంరక్షణ, సంక్షేమం, సేవలు, విద్య తదితర అంశాల్లో నెలకొన్న అనిశ్చితి వల్లే ప్రత్యేక హక్కుల కోసం గతంలో.. ప్రపంచవ్యాప్తంగా అనేక ఉద్యమాలు జరిగాయి. మొదటిసారిగా 1920లో ప్రారంభమైన వినియోగదారుల ఉద్యమం క్రమక్రమంగా.. పలు దేశాలకు వ్యాపించింది. 1962లో మార్చి 15న అప్పటి అమెరికా దేశాధ్యక్షుడు జాన్ ఎఫ్ కెన్నెడి... దేశ పౌరుల కోసం ప్రప్రథమంగా వినియోగదారుల హక్కులు ప్రకటించారు. 1972లో అంతర్జాతీయ వినియోగదారుల సంఘాల సంస్థ ప్రాంతీయ సంచాలకుడు అన్వర్ ఫజల్ మార్చి 15 తేదీనే 'ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం'గా పరిగణించాలని తీర్మానించారు. దాంతో 1972 నుంచి ప్రపంచ వ్యాప్తంగా మార్చి15వ తేదీనే వినియోగదారుల హక్కుల దినంగా పాటించడం మొదలు పెట్టాయి. మన దేశంలో 1986లో వినియోగదారుల రక్షణ చట్టం అమల్లోకి వచ్చింది. వినియోగదారుల రక్షణ చట్టాన్ని మరింత బలోపేతం చేస్తూ 2019లో చట్ట సవరణ చేశారు. ఈ చట్టం ప్రకారం ప్రభుత్వం వినియోగదారులకు హక్కులు లభించాయి. వినియోగదారులకు రక్షణ హక్కు, సమాచార హక్కు, వస్తు సేవల చేసుకునే హక్కు, ప్రాతినిధ్య హక్కు, విజ్ఞాపన హక్కు, విద్య హక్కుల ప్రయోజనాలు లభిస్తాయని మేలుకొలుపు వినియోగదారుల సంరక్షణ సంఘం కార్యదర్శి దాసరి ఇమ్మానుయేలు తెలిపారు. వినియోగదారుల హక్కుల గురించి ఆయన వివరించారు.

వినియోగదారుల హక్కులు

1. వినియోగదారుల రక్షణ: మానవ ప్రాణాలకు, ఆస్తికి ప్రమాదకారక వస్తువులు, సేవల నుంచి రక్షణ పొందే హక్కు. అవసరాలు తీర్చడమే కాకుండా, దీర్ఘకాలం మన్నే వస్తువులు, సేవలను పొందాలి.

2. సమాచారం పొందే హక్కు: అవాంఛిత వ్యాపార కార్యకలాపాల నుంచి వినియోగదారులకు రక్షణ కల్పించేందుకు వస్తు నాణ్యత, బరువు, స్వచ్ఛత, పుష్టి, ప్రమాణం గురించి తెలియజేయాలి. నాణ్యమైన సేవలు పొందే సమాచారాన్ని తెలుసుకునే హక్కు ఉంది.

3. వస్తువులను, సేవలను ఎంపిక చేసుకునే హక్కు: వివిధ రకాల వస్తువులు, సేవలు పొందేటప్పుడు వాటి మధ్య రేటు తెలుసుకోవడం మంచిది. సముచిత రేటులో నాణ్యత, సేవలు పొందడం పౌరుల హక్కు.

4. ప్రాతినిధ్యం వహించే హక్కు: వినియోగదారుల ఆసక్తిని, వారి అవసరాలను సరైన వేదికలు, ఫోరంలలో వినిపించడం. వినియోగదారుల సంక్షేమార్థం ఏర్పాటు చేసిన వివిధ వేదికలలో ప్రాతినిధ్యం వహించడం.

5. పరిహారం పొందే హక్కు: వినియోగదారుల ఫోరంలో కేసు వేయడం చేయడం ద్వారా సేవాలోపాలు, వస్తు లోపాల నుంచి వినియోగదారులు మోసానికి గురయినప్పుడు ఫోరంలో కేసులు వేసి, తగిన పరిహారాన్ని పొందడం.

6. వినియోగదారుల విద్య హక్కు- వినియోగదారులు నిరంతరం తమ హక్కులను తెలుసుకుంటూ, తమ జ్ఞానాన్ని పెంచుకోవడం, నైపుణ్యాలను పెంపొందించుకోవడం ఎంతో అవసరం. గ్రామీణ ప్రాంతాలలో వినియోగదారులు హక్కుల పట్ల అవగాహన లేక ఎంతో మోసపోతున్నారు.

2019 చట్టం ద్వారా జిల్లా కలెక్టర్లను సైతం ఫిర్యాదులు స్వీకరించి, విచారించే అవకాశం వచ్చింది. తప్పుడు ప్రకటనలు చేసే సెలబ్రెటీలను సైతం శిక్షించేలా, జరిమానాలు విధించేలా చట్టం రూపొందించారు. మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకునేందుకు అవకాశం కల్పించారు.

వినియోగదారుల రక్షణ చట్టం అమలు కోసం మూడంచెల వినియోగదారుల పరిష్కారాల కమిషన్లను నియమించారు. జిల్లా స్థాయిలో రూ.50 లక్షల నష్టపరిహారం కోరవచ్చు. రూ.5 లక్షల వరకు ఎటువంటి రుసుమూ చెల్లించనవసరంలేదు. రాష్ట్ర స్థాయిలో రూ.2 కోట్ల వరకు, ఆపైన జాతీయ స్థాయి కమిషన్లలో కేసులు వేసుకోవాలి. వినియోగదారులు కేసు ఫైల్ చేసేందుకు ఎటువంటి న్యాయవాది అవసరం లేకుండానే నేరుగా వినియోగదారులే కేసు వేయవచ్చు.



బంగారం కొనుగోలు చేసే వినియోగదారులు ఖచ్చితంగా హాల్ మార్క్, బిఐఎస్ ముద్ర, నాణ్యతా కేరెట్స్ ముద్ర, లైసెన్స్ నంబరు పరిశీలించాలి. కొనుగోలు చేసిన వారు ప్రతి వస్తువుకు తగిన యజమాని సంతకం, తేదీ, ముద్రతో కూడిన రశీదు తీసుకోవాలి.

పండ్లు, కూరగాయలపై చల్లుతున్న రసాయనాల నుంచి రక్షణ పొందేందుకు గోరువెచ్చని నీటిలో కొన్ని నిమిషాలు కడిగి వినియోగించుకోవాలి.

తూనికలు, కొలతల్లో జరుగుతున్న మోసాలను గుర్తించిన వెంటనే ఫిర్యాదు చేయాలి. ఇటీవల మాంసం దుకాణాలలో, కూరగాయల మార్కెట్లలో, రైతులు పండించే పంటలు కొనుగోళ్లలో జరుగుతున్న మోసాలను గమనిస్తూనే ఉన్నాం.

ఆన్‌లైన్‌లో వస్తువులు కొనుగోలు చేసేముందు సంబంధిత సంస్థ చిరునామా, ఫోన్ నంబర్, ఇమెయిల్ అడ్రస్‌లు ఖచ్చితంగా పరిశీలించాలి.

టేస్టింగ్ సాల్ట్, ఫుడ్ కలర్స్, మిథైల్ వంటి రసాయనాలను వినియోగించే ఆహార పదార్థాలను స్వీకరించకూడదు. ఉదయాన్నే తాగే టీ పౌడర్, కాఫీ పౌడర్‌లు నేడు కల్తీలతో నిండిపోయాయి. శక్తి వస్తుందని చెప్పే విష పదార్థాలతో కూడిన కూల్ డ్రింకులను వాడకపోవడమే మంచిది. కార్బైడ్ వినియోగించి పండించే పండ్లను వినియోగించకండి.

రంగు వస్తారని, బరువు తగ్గుతారనే ప్రకటనలను చూసి మోసపోకండి. వాటిని జాగ్రత్తగా పరిశీలించాలి. పెట్రోలు, గ్యాస్ కొనుగోళ్ల సమయంలో ఖచ్చితంగా కొలతలను పరిశీలించండి.

ఇంటి స్థలాలు, ప్లాట్లు కొనుగోలు చేసేటప్పుడు లింక్ డాక్యుమెంట్లను, ఇసిలను తనిఖీ చేసుకోండి. ఎటువంటి కోర్టు కేసులు లేవని, అనుమతులను పరిశీలించండి. రైతులు విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు కొనుగోలు చేసే సమయంలో ఖచ్చితంగా రశీదులు తీసుకోవాలి. నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల నుంచి నష్టపోయినట్లయితే పరిహారం పొందే అవకాశం ఉంటుంది.

ప్రైవేటు వైద్యశాలల్లో పేషెంట్లు తమకు అందిస్తున్న చికిత్స వివరాలు, వాటికి సంబంధించి చేస్తున్న పరీక్షల వివరాలు, వినియోగిస్తున్న మందుల వివరాలు పొందవచ్చు. వాటికి సంబంధించిన రికార్డులు, రశీదులు ఖచ్చితంగా తీసుకోవాలి. ప్రయాణ సాధనాలైన రైల్వే, విమానం, ఆర్టీసీ, ఓలా, ఉబర్ వంటి సంస్థల నుంచి సైతం తమకు కలిగిన నష్టాన్ని, సేవల్లో కలిగే నష్టాలకు పరిహారం పొందవచ్చు.

వినియోగదారుల రక్షణ చట్టం-2019ని వినియోగించుకొని నష్టపరిహారం పొందవచ్చనే అవగాహన కలిగి ఉండాలి.


బెంచీలను బహూకరించిన దృశ్యం

గ్రామాభివృద్ధికి యువత పాటుపడాలి

ప్రజాశక్తి-అద్దంకి

గ్రామాలలో యువత ప్రజానీకానికి సేవలతో పాటు గ్రామాభివృద్ధికి కృషి చేయాల్సిన అవసరం ఉందని మా ఊరు అభివృద్ధి కమిటీ బాధ్యులు బి శ్రీనివాసరావు పేర్కొన్నారు. దాతల సహకారంతో రూ.30 వేల విలువచేసే బల్లలను వేలమూరిపాడు మా ఊరు అభివృద్ధి కమిటీకి అందజేశారు. ఈ సందర్భంగా దాతలు శ్రీలక్ష్మి మాట్లాడుతూ అద్దంకి నుంచి వేలమూరిపాడు రోడ్డు మార్గం వాకర్స్‌కు ఎంతగానో ఉపయోగపడుతోందని, ఉదయం, సాయంత్రం సమయాల్లో సుమారు 200 మందికి పైగా వాకర్స్ నడకని కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. మార్గ మధ్యంలో వాళ్లు సేదతీరటానికి బెంచీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో మరిన్ని బెంచ్‌లను ఏర్పాటు చేసి అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. మా ఊరు అభివృద్ధి కమిటీ రాజకీయాలకు అతీతంగా గ్రామాన్ని అభివృద్ధి చేసుకుంటూ ఆదర్శంగా నిలిచిందన్నారు. తనతోపాటు ముందుకొచ్చి సహకరించిన నవయుగ స్వీట్స్ వారికి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. దాతృత్వ హృదయాలను అభినందిస్తూ త్వరలోనే అభినందన సభ ఏర్పాటు చేస్తామని తెలిపారు. మా గ్రామస్తుల తరపు నుంచి వారికి ప్రత్యేక అభినందనలు తెలియజేస్తున్నామని వివరించారు.

తల్లుల కమిటీ సమావేశం

ప్రజాశక్తి-రేపల్లె



సమావేశంలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్

రేపల్లె మండలం పోటుమెరక, తుమ్మల, పిరాట్లంక, చోడాయపాలెం, విశ్వేశ్వరం గ్రామాలలో చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ క్రాఫ్ ఆధ్వర్యంలో గ్రామ బాలల రక్షణ కమిటీ ఇసిసిడి, తల్లుల కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. ఆయా గ్రామాల్లో ఉన్న గర్భిణులు, బాలింతలు 20 మందితో సమావేశం ఏర్పాటు చేశారు. శిశువు గర్భదశ నుంచి ఎలా ఎదుగుతారో, పెరుగుదల ఎలా ఉంటుందో ఎలాంటి ఆహారం తీసుకోవాలో ఎలాంటి ఆహారం తీసుకోకూడదో మొదలైన విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అంగన్‌వాడీ సూపర్‌వైజర్స్ నాంచారమ్మ పాల్గొని మాట్లాడారు. అంగన్‌వాడీ సెంటర్లలో గర్భిణులకు, బాలింతలకు మంచి పోష్టికాహారం అందిస్తున్నామని చెప్పారు. బాలింతలుగాని, గర్భిణులు గాని, ఎవ్వరైనా అనారోగ్యంతో బాధపడితే వెంటనే స్థానిక ఏఎన్ఎం వారికి, లేదా అంగన్‌వాడీ టీచర్‌కు చెప్పాలని సూచించారు. గర్భదశలో ఉన్న శిశువు నుంచి 5 సంవత్సరాలలోపు ఉన్న పిల్లల ఎదుగుదల, వారి మానసిక ప్రవర్తన ఎలా ఉంటుందో తెలియపరిచేదే ఐసిసిడి అని తెలిపారు. గర్భిణిగా ఉన్నపుడు పాటించే పద్ధతుల గురించి, శిశువు పుట్టిన తరువాత పాటించే పద్ధతులు గురించి క్లుప్తంగా వివరించారు. పిల్లలను చూసుకోవడంలో తల్లి బాధ్యతనే కాకుండా తండ్రి బాధ్యత కూడా ఉంటుందని, అప్పుడే పిల్లలు మంచి ప్రవర్తనతో ఎదుగుతారని చెప్పారు. కార్యక్రమానికి చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ - క్రాఫ్ కమ్యూనిటీ ఆర్గనైజర్స్ పి ఆషా సంధానకర్తలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో, బాలింతలు, గర్భిణులు, తల్లులు, బాలలు, అంగన్‌వాడీ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేస్తున్న దృశ్యం

పెన్నులు అందజేత

ప్రజాశక్తి-పంగులూరు

పంగులూరులోని మాగుంట సుబ్బరామిరెడ్డి, మరియు బాచిన నారాయణమ్మ జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థి రాయిని రామకృష్ణ, కళాశాలలోని విద్యార్థులకు మంగళవారం ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ నెల 15వ తేదీ నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభం కానున్న దృష్ట్యా కాలేజీలోని ఇంటర్మీడియట్ ఫస్టియర్, సెకండియర్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఈ ప్యాడ్స్, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ, విద్యార్థులు చక్కగా పరీక్షలు రాసి, మంచి ఫలితాలు సాధించి, కళాశాలకు మంచిపేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రమేష్‌బాబు, కళాశాల పిడి మేకల సీతారామిరెడ్డి, గోపిచంద్‌రెడ్డి, సాఫ్ట్‌వేర్ విద్యార్థి సిహెచ్ కౌండిన్య తదితరులు పాల్గొన్నారు.


నిత్యావసర సరుకుల కిట్లు అందజేస్తున్న మంత్రి నాగార్జున

పేదలకు సరుకుల కిట్లు పంపిణీ

ప్రజాశక్తి-భట్టిప్రోలు

మండలంలోని పెదపులివర్రు గ్రామం జిలుగువారిపాలెంలో రావెల జార్జి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేదలకు నిత్యావసర కిట్లను సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మెరుగు నాగార్జున చేతుల మీదుగా అందజేశారు. చిత్తూరుకు చెందిన రీడ్స్ సౌజన్యంతో అందజేసిన ఈ కిట్ల పంపిణీ అభినందనీయమని మంత్రి కొనియాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నీలా ఉషారాణి రమేష్, ఎంపిపి డివి లలితకుమారి, నాయకులు నీలా నాగరాజు, కత్తులు సందీప్, బాబూరావు, న్యాయవాదులు చంద్రశేఖర్, శేరు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


ర్యాలీగా మచిలీపట్నం వెళుతున్న జనసేన పార్టీ నాయకులు

జనసేన ఆవిర్భావ సభకు తరలిన కార్యకర్తలు

ప్రజాశక్తి-రేపల్లె

జనసేన పార్టీ 10వ ఆవిర్భావ బహిరంగసభకు నియోజకవర్గ నుంచి కార్యకర్తలు భారీగా తరలివెళ్లినట్లు ఆ పార్టీ నాయకులు గల్లా చందు తెలిపారు. బుధవారం పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన పార్టీ నియోజకవర్గంలోని చెరుకుపల్లి, నగరం, నిజాంపట్నం, రేపల్లె మండలంలోని జనసేన పార్టీ కార్యకర్తలు, అభిమానులు ర్యాలీగా వెళ్లే క్రమంలో క్రమశిక్షణ పాటించాలని కోరారు. కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు మత్తి భాస్కరరావు, పట్టణ అధ్యక్షులు రాతంశెట్టి మహేష్, నాయకులు గళ్ల వెంకయ్య, చందోలు ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.



నాటిక పోటీలు ప్రారంభిస్తున్న దృశ్యం

సమాజ చైతన్యానికి నాటకరంగం కృషి

మార్టూరులో రెండు రాష్ట్రాల నాటిక పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

ఆర్థిక మూలాలే ప్రధానంగా భావిస్తున్న నేటి సమాజంలో.. సమాజాన్ని చైతన్యపరిచేందుకు నాటక రంగం కృషి చేస్తోందని 3150 రోటరీ గవర్నర్ తాళ్ల రాజశేఖరరెడ్డి అన్నారు. శ్రీకారం స్వచ్ఛంద సేవాసంస్థ, రోటరీ క్లబ్ ఆఫ్ మార్టూరు సౌజన్యంతో శ్రీకారం రోటరీ కళాపరిషత్ 13వ తెలుగు రాష్ట్రాల నాటిక పోటీలు బాపట్ల జిల్లా, మార్టూరులో మంగళవారం ప్రారంభమయ్యాయి. ముందుగా నటరాజ పూజతో కార్యక్రమం ప్రారంభించగా శ్రీకారం అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు, జాష్టి అనురాధ, ఎఫర్ట్ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జాష్టి వెంకటమోహనరావు జ్యోతిప్రజ్వలన చేశారు. అనంతరం రోటరీ గవర్నర్ నాటిక పోటీలను ప్రారంభించారు. అనంతరం శర్వాణి ఫైన్ ఆర్ట్స్ బోరివంక ఆధ్వర్యంలో బిఎంఎస్ పట్నాయక్ దర్శకత్వంలో కెకె.ఎల్ స్వామి రచించిన 'కొత్త పరిమళం' నాటిక వీక్షకులను ఆలోచింపజేసింది. అనంతరం శ్రీ సాయి ఆర్ట్స్ కొలకలూరి వారి ఆధ్వర్యంలో గోపరాజు విజయ్ దర్శకత్వంలో రావి నాగేశ్వరరావు రచించిన 'ప్రేమతో నాన్న', గంగోత్రి పెదకాకాని ఆధ్వర్యంలో నాయుడు గోపి దర్శకత్వంలో డాక్టర్ సిహెచ్ శ్రీనివాసరావు రచించిన 'పేగు రాసిన శాసనం', చివరిగా ప్రదర్శించిన జనచైతన్య ఒంగోలు వారి ఆధ్వర్యంలో వరికూటి శివప్రసాద్ రచించి, దర్శకత్వం వహించిన 'చేతివ్రాత' నాటికలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కొర్రపాటి కాజారావు, కుర్రా వెంకటరామయ్య, 2023-24 రోటరీఅసిస్టెంట్ గవర్నర్ ఇంటూరి ఆంజనేయులు, మాజీ అధ్యక్షులు లింగా ఆంజనేయులు, రావి అంకమ్మ చౌదరి, షేక్ ఖాజాహుస్సేన్, బసవరాములు, చెరుకూరి అంజిబాబు, ఎమ్.ఈశ్వరప్రసాద్, కందిమళ్ల రవిబాబు పాల్గొన్నారు.

నేడు ప్రదర్శించే నాటికలు

అద్దేపల్లి ఆరాధ్యుల ఆర్ట్స్ తెనాలి వారిచే శవరంజని, కళావర్షిణి వీరన్నపాలెం వారిచే రాజరాజచోరులు, శ్రీ సద్గురు కళానిలయం గుంటూరు వారిచే కమనీయం నాటికలు బుధవారం ప్రదర్శించనున్నారు.

పిల్లల ఆరోగ్యం కోసం

ఆల్‌బెండజోల్ మాత్రలు తప్పనిసరి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

పిల్లల ఆరోగ్యం కోసం తప్పనిసరిగా ఆల్‌బెండజోల్ మాత్రలు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ పిలుపునిచ్చారు. మంగళవారం జాతీయ నులిపురుగుల నిర్మూలనా దినోత్సవం సందర్భంగా బాపట్ల, సూర్యలంకలోని కేంద్రీయ విద్యాలయంలో కలెక్టర్ విద్యార్థులకు ఆల్‌బెండ్‌జోల్ టాబ్లెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని ఈ నెల 14 నుండి 18 వరకు ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులకు తప్పనిసరిగా సంవత్సరానికి రెండుసార్లు నులిపురుగుల నివారణకు ఆల్ బెండ్ జోల్ మాత్రలు ఇవ్వాలని సూచించారు. ఆల్‌బెండ్‌జోల్ మాత్రలు వాడటం వల్ల పిల్లలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. పిల్లలు ఆరోగ్యంగా జీవిస్తూ.. మంచి లక్ష్యాలను సాధించాలన్నారు. కార్యక్రమంలో సూర్యలంక ఎయిర్‌ఫోర్స్ కమాండర్ ఆర్.ఎస్.చౌదరి, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ విజయమ్మ, కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపల్ బి.నాగేశ్వరరావు, తహశీల్దార్ కవిత పాల్గొన్నారు.

మంత్రి సురేష్‌ని కలిసిన ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం



మంత్రితో ఎమ్మెల్యేల సెల్ఫీ

అసెంబ్లీ సమావేశాలు జరుగనున్న నేపథ్యంలో తాడేపల్లిలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్‌ను జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు మర్యాదపూర్వకంగా కలిశారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వద్ద ఉన్న కీలక శాఖలలో చట్టం మరియు న్యాయ శాఖలకు సంబంధించిన బాధ్యతలను అసెంబ్లీలో చర్చించే విషయమై ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మంత్రి సురేష్‌కు అప్పగించారు. ఈ సందర్భంగా మార్కాపురం ఎమ్మెల్యే కందుల నాగార్జునరెడ్డి, కనిగిరి ఎమ్మెల్యే బుర్రా మధుసూధన్ యాదవ్, దర్శి ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్, ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు మర్యాద పూర్వకంగా కలిశారు. వారంతా కలిసి సెల్ఫీ దిగారు.

మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడితే చర్యలు

- ఇంటర్ పరీక్షలకు పటిష్ట బందోబస్త్ ఏర్పాటు - ఎస్‌పి వకుల్‌జిందాల్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

జిల్లాలో మార్చి 15వ తేదీ నుండి ఏప్రిల్ 3 వరకు ఉదయం తొమ్మిది గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు ఇంటర్మీడియట్ పరీక్షలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో పరీక్ష కేంద్రంలోకి ప్రవేశించే విద్యార్థులను, పరీక్షా కేంద్రం వద్ద విధులు నిర్వహించే అన్ని శాఖల సిబ్బందిని తనిఖీ చెయ్యాలని ఎస్పీ వకుల్‌జిందాల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయం నుండి జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఇంటర్మీడియట్ పరీక్షలు సమర్ధవంతంగా నిర్వహించడానికి తీసుకోవలసిన భద్రతా చర్యల గురించి జిల్లా పోలీస్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. జిల్లాలో మొత్తం 34 పరీక్షా కేంద్రాలలో ఇంటర్మీడియట్ పరీక్షలు జరుగుతాయని, పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న పరీక్షా కేంద్రాలలో అవసరమైన వరకు పోలీస్‌బందోబస్తు ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. పరీక్ష కేంద్రంలోకి ప్రవేశించే విద్యార్థులను, పరీక్షా కేంద్రం వద్ద విధులు నిర్వహించే అన్ని శాఖల సిబ్బందిని తనిఖీ చేయాలన్నారు. వారి వద్ద ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్, స్మార్ట్ వాచ్, మొబైల్ ఫోన్స్, ఐపాడ్ మరియు ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించకూడదన్నారు. పరీక్షా కేంద్రం బయట కూడా పటిష్టబందోబస్తు నిర్వహిస్తూ బయటివారు ఎవరు లోపలకి ప్రవేశించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్షా కేంద్రాలకు దగ్గరలో ఉన్న జిరాక్స్, కంప్యూటర్ సెంటర్లను, స్టేషనరీ షాప్స్‌ను పరీక్షలు జరిగే సమయంలో మూయించాలన్నారు. ప్రశ్నాపత్రాలు ఉదయం 8.30 గంటలకు ముందు పోలీస్ స్టేషన్ నుండి బయటకు పంపరాదన్నారు. ఉదయం 8.30 గంటల తరువాత మాత్రమే తగిన బందోబస్తుతో పరీక్ష పేపర్లు కేంద్రాలకు తీసుకువెళ్లాలన్నారు. సమాధాన పత్రాలు తీసుకెళ్లేటప్పుడు తగిన పోలీసు ఎస్కార్ట్ ఉండాలన్నారు. పోలీస్ స్టేషన్ ఎస్.హెచ్.ఓ వారి పరిధిలో ఉన్న పరీక్షా కేంద్రాలను తరచూ సందర్శిస్తూ ఉండాలన్నారు. ఒక్క చిన్న పొరపాటు కూడా లేకుండా పగడ్బందీ బందోబస్తు నడుమ ప్రశాంతమైన వాతావరణంలో ఇంటర్మీడియట్ పరీక్షలు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రంలోకి విద్యార్థులతో పాటు పరీక్షా కేంద్రం వద్ద విధులు నిర్వహించే అన్ని శాఖల సిబ్బందికి కూడా ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్స్, స్మార్ట్ వాచ్, మొబైల్ ఫోన్స్, ఐపాడ్ మరియు ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతి లేదన్నారు. పరీక్షా కేంద్రం ఇన్‌ఛార్జి వద్ద మాత్రమే ప్రభుత్వం జారీచేసిన కీ ప్యాడ్ మొబైల్‌ఫోన్ ఉంటుందన్నారు. అది కూడా 9.30 గంటల నుండి 10 గంటల వరకు మాత్రమే పనిచేస్తుందని తెలిపారు. చిట్టీలు, పుస్తకాలు పెట్టి మాస్ కాపీయింగ్, మాల్ ప్రాక్టీస్‌కు విద్యార్థులు ఎవరైనా పాల్పడితే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జూమ్ సమావేశంలో డిసిఆర్‌బి డిఎస్‌పి జి.లక్ష్మయ్య, చీరాల డిఎస్‌పి పి.శ్రీకాంత్, రేపల్లె డిఎస్‌పి టి.మురళీకష్ణ , డిసిఆర్‌బి ఇన్స్పెక్టర్ పి.బాలమురళీకష్ణ, డి.ఎస్.బి ఇన్స్పెక్టర్ ఏ.శ్రీనివాస్, జిల్లాలోని సర్కిల్ ఇన్స్పెక్టర్‌లు, స్టేషన్ ఎస్‌హెచ్‌ఒ పాల్గొన్నారు.

'సూర్యలంక'లో ఎకో టూరిజంగా

అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు

కలెక్టర్ విజయకృష్ణన్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా



తాబేళ్లను సముద్రంలోకి వదులుతున్న కలెక్టర్

జిల్లాలో సూర్యలంక సముద్రతీరంలో ఎకో టూరిజంగా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడం జరిగిందని జిల్లా కలెక్టర్ విజయ కష్ణన్ వెల్లడించారు. మంగళవారం బాపట్ల సూర్యలంక తీర ప్రాంతంలో ఆలీవ్ రిడ్లీ సముద్ర తాబేళ్లను జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, జిల్లా ఎస్‌పి వకుల్ జిందాల్ సముద్రంలోకి వదిలారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ టూరిస్టులు సముద్ర తీర ప్రాంతంలో ఉన్న ఆలీవ్ రిడ్లీ సముద్ర తాబేళ్ల గుడ్లను కనబడితే పారవేయకుండా అటవీశాఖ అధికారులకు అప్పగించాలన్నారు. సముద్రంలో మత్స్య సంపదకు ముప్పు వాటిల్లకుండా ఆలీవ్ రిడ్లి సముద్ర తాబేళ్లను సముద్రం లోకి వదలడం జరుగుతుందన్నారు. సూర్యలంక సముద్ర తీరంలో ఆలీవ్ రిడ్లి సముద్ర తాబేళ్లను వదిలి పెట్టడం చాలా సంతోషంగా ఉందన్నారు. జిల్లాలో సముద్ర తీరంలో అలీవ్ రిడ్లి సముద్ర తాబేళ్ల గుడ్లు పొదగడానికి ఏడు ప్రాంతాలను ఎంపిక చేయడం జరిగిందని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్.పి మహేష్, సూర్యలంక ఎయిర్ ఫోర్స్ కమాండర్ ఆర్.ఎస్.చౌదరి, తహశీల్దార్ కవిత పాల్గొన్నారు.

పదోతరగతి పబ్లిక్ పరీక్షలు

పకడ్బందీగా నిర్వహించాలి

అధికారులకు కలెక్టర్ ఆదేశం

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

పదోతరగతి పబ్లిక్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె.విజయకృష్ణన్ ఆదేశించారు. పదోతరగతి పరీక్షల నిర్వహణపై జిల్లాస్థాయి అధికారుల సమన్వయ సమావేశం మంగళవారం స్థానిక కలెక్టర్ ఛాంబర్లో జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల జీవితాలు మార్చే పదోతరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లూ చేయాలని ఆదేశించారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులు చక్కగా పరీక్షలు రాయడానికి ఏర్పాట్లు చేయాలన్నారు. బాపట్ల జిల్లాలో 331 పాఠశాలల నుంచి 17,344 మంది విద్యార్థులు పబ్లిక్ పరీక్షలకు హాజరవుతున్నారన్నారు. వీరికోసం 103 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఏప్రిల్ 3 నుంచి 18వ తేదీ వరకు పదోతరగతి పరీక్షలు ఉంటాయన్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు రెగ్యులర్ విద్యార్థులకు పరీక్ష జరుగుతుందన్నారు. ఇదే క్రమంలో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఓపన్ స్కూల్ పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్షా సమయానికి అర్ధగంట ముందుగా పరీక్షా కేంద్రానికి విద్యార్థులు హాజరు కావాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా అధికారులు అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. పరీక్షలలో మాస్ కాపీయింగ్ జరుగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ విజయకష్ణన్ ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ పక్కాగా అమలు చేయాలని, పోలీస్ బందోబస్తు నియమించాలన్నారు. పరీక్షా కేంద్రాలలోకి సెల్ ఫోన్లు అనుమతించరాదన్నారు. పరీక్షా కేంద్రాలలో మరుగుదొడ్లు, త్రాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పించాలన్నారు. పరీక్షా కేంద్రాలు, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. అత్యవసర పరిస్థితులను దష్టిలో ఉంచుకొని ప్రతి కేంద్రం వద్ద ప్రాథమిక వైద్యం అందించేలా సిబ్బందిని నియమించాలన్నారు. పరీక్షా కేంద్రాల సమీపంలో జెరాక్స్ మిషన్లు మూత వేయించాలన్నారు. పబ్లిక్ పరీక్షలు ప్రారంభం నుంచి ముగిసే వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలన్నారు. పరీక్షా కేంద్రానికి విద్యార్థులు సకాలంలో చేరుకునేలా ఆర్.టి.సి. బస్సులను నడపాలని ఆదేశించారు. ఈ నెల 25వ తేదీన 10వ తరగతి పరీక్షల ప్రశ్నాపత్రాలు బాపట్లకు చేరుతాయన్నారు. స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపరచిన అనంతరం ముందస్తుగా గుర్తించిన 29 పోలీస్ స్టేషన్లకు ప్రశ్నాపత్రాలను పంపాలన్నారు. ప్రశ్నాపత్రాలు లీక్ కాకుండా పటిష్టమైన పోలీస్ భద్రత కల్పించాలన్నారు. ప్రశ్నాపత్రాలు తరలించడానికి వాహనాలు సిద్ధం చేసుకోవాలన్నారు. 103 మంది చీఫ్ సూపరింటిండెంట్లు, మరో 103 డిపార్ట్ మెంటల్ ఆఫీసర్లు, రూట్ ఆఫీసర్లుగా తొమ్మిది మందిని, మరో తొమ్మిది మందిని అసిస్టెంట్ రూట్ ఆఫీసర్లుగా నియమించామన్నారు. 10 ఫ్లయింగ్ స్క్వాడ్‌లను, 870 మంది ఇన్విజిలేటర్లను నియమించినట్లు కలెక్టర్ తెలిపారు. సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ డాక్టర్ కె. శ్రీనివాసులు, ఏ.ఎస్.పి. మహేష్, డి.ఇ.ఓ. పి.వి. రామారావు, వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ విజయమ్మ, డి.పి.ఓ. వై. శంకర్ నాయక్, ఆర్.టి.ఓ. చంద్ర శేఖర రెడ్డి, ఆర్.టి.సి. ఆర్.ఎమ్. రామారావు, అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.